సంపుటి : 9
సంచిక : 345
ఆదివారం
06 సెప్టెంబర్ 2026
పేజీలు : 12
వెల : 2/-
E-PAPER

# విశ్వవాయిస్

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY.

SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT

CERCULATED AT : • WEST GODAVARI • VISAKHAPATNAM • SRIKAKULAM • VIJAYANAGARAM • VIJAYAWADA • HYDERABAD • BANGLORE • CHENNAI, • DELHI • MUMBAI • TIRUPATHI • ANANTAPUR • GUNTUR • KADAPA • KHAMMAM • KARIMNAGAR • KURNOOL • NELLORE • NIZAMABAD • ONGOLE




Contact For Ads:
7579339999

### సాంకేతికత ఎంత పెరిగినా

# టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

- టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే భర్తీ చేయగలం: సీఎం చంద్రబాబు
- విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- సీఎంగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశానని వెల్లడి
- టెక్నాలజీ పెరిగినా గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని స్పష్టం
- చిన్నప్పుడు టీచర్ చేతిలో దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని వ్యాఖ్య



**విజయవాడ, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** సాంకేతికత ఎంత పెరిగినా టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సమాజంలో గొప్ప వ్యక్తులంతా ఉపాధ్యాయుల చేతుల్లో ఎదిగిన వాళ్లేనని చెప్పారు. విజయవాడలోని 'ఎ' కన్వెన్షన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం పాల్గొన్నారు. తొలుత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం మాట్లాడారు.

"1991 నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఎక్కడికక్కడ పోటీతో పాటు అవకాశాలు పెరిగాయి. టెక్నాలజీతో మంచి చెడు రెండూ ఉన్నాయి. నేటి కాలంలో బోధనా విధానం పూర్తిగా మారింది. మా చిన్నప్పుడు టీచర్లు బాగా కొట్టేవారు. భయభక్తులతో చదువుకునే వాళ్లం. టీచర్‌తో దెబ్బలు తిన్నవారంతా బాగుపడతారు. పిల్లల మానసిక స్థితి మారుతోంది.. టీచర్లు గమనించాలి. మారుతున్న సాంకేతికత పిల్లలపై పెను ప్రభావం చూపిస్తోంది. సామాజిక మాధ్యమాలు పిల్లలకు శాపంగా మారాయి. పిల్లల్లో కుటుంబ విలువలు, నైతిక ప్రవర్తన పెంపుపై టీచర్లు దృష్టి పెట్టాలి.

**టీచర్లు గౌరవంగా జీవించాలి**

అన్ని పాఠశాలల్లో మౌలిక వసతులు పెంచుతున్నాం. బడి పరిసరాలు పచ్చగా ఉండాలి.. అప్పుడే పిల్లలకు మంచి ఆలోచనలు వస్తాయి. బడిలో పచ్చదనం పెరిగేలా టీచర్లు చర్యలు తీసుకోవాలి. తెదేపా అధికారంలో ఉండగా 14 డీఎస్సీలు చేపట్టాం. టీచర్లు గౌరవంగా జీవించాలి.. రాజకీయ నేతల చుట్టూ తిరగకూడదు. ప్రతిభావంతులైన టీచర్లను అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నాం. టెలికామ్, ఐటీ గురించి ముందే ఊహించా.. ఈ విషయం అప్పటి ప్రధానికి చెప్పా. ఆనాడు మేం వేసిన పునాది వల్లే హైదరాబాద్ రూపురేఖలు మారాయి. ఇప్పుడు ఏ దేశానికి వెళ్లినా మన తెలుగువాళ్లు కనిపిస్తారు. విదేశాల్లో ఎక్కువ సంపాదించేది కూడా తెలుగువాళ్లే. టెక్నాలజీని వాడుకుంటేనే అందరికంటే ముందుకెళ్లగలం. ఏఐ, క్వాంటం, డేటా సెంటర్లు,

మిగతా .. 2లో..

### 2013లో ఎలా ఉన్నామో

# ఇప్పుడెలా ఉన్నామో చూడండి

**స్తబ్దత నుంచి శరవేగంగా దూసుకుపోతున్నాం : ప్రధాని మోదీ**



**ఢిల్లీ, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** విధానపరమైన స్తబ్దత నుంచి కోలుకుని ఈ పుష్కర కాలంలో చైతన్యంతో భారత్ ఎంతో పురోగమించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. దేశాన్ని బలహీనతలోకి నెట్టినవారు ప్రస్తుతం సాధిస్తున్న 7.8శాతం వృద్ధిరేటును జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించినవారు ఇప్పుడు చిత్తుగా ఓడిపోయారని, పాకిస్థాన్ ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా... భారత సైన్యం వారి గడ్డపైకే వెళ్లి బుద్ధి చెప్పగలుగుతోందన్నారు. అంతర్గతంగా నక్సలిజం

మిగతా .. 2లో..

# పిల్లలను తీర్చిదిద్దే పుణ్యకార్యం టీచర్లదే

**బాల్యంలోనే సత్ప్రవర్తనను నేర్పాలి - ఆత్మవిశ్వాసం నింపి ముందుకు నడిపించాలి**
**జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము**



**ఢిల్లీ, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే పుణ్యకార్యం టీచర్లకే సాధ్యమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. బాల్యం నుంచే పిల్లల్లో శారీరక, మానసిక వికాసంతో పాటు నైతికతను పెంపొందించడంపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. దేశ రెండో రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన 82 జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ద్రౌపదీ ముర్ము శనివారం దిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో ప్రదానం

మిగతా .. 2లో..

### ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా..

# వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

**ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు**



**నర్సీపట్నం, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సంచలన ప్రకటన చేశారు. తాను ఇకపై రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన జన్మదిన వేడుకల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వయసు

మిగతా .. 2లో..

# 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

**రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం**



**విజయవాడ, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. "సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. "ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు

మిగతా .. 2లో..

### పవన్ కల్యాణ్ ఎఫెక్ట్..

# ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

- ఆంధ్రా పేపర్ మిల్లుకు రూ. 21.01 కోట్ల పర్యావరణ జరిమానా
- కాలుష్య నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘిస్తున్నందుకు ప్రభుత్వ చర్యలు
- పవన్ కల్యాణ్ తీవ్ర హెచ్చరికల నేపథ్యంలో జరిమానా విధింపు
- మిల్లుకు రూ. 21.34 కోట్ల పన్ను బకాయిలు ఉన్నట్లు ఆరోపణలు
- యాజమాన్యం తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమండ్రిలోని ఆంధ్రా పేపర్ లిమిటెడ్ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) నిబంధనలను పదేపదే ఉల్లంఘిస్తూ, పవిత్ర గోదావరి నదిని కలుషితం చేస్తున్నందుకు గాను ఏకంగా రూ. 21.01 కోట్ల భారీ పర్యావరణ జరిమానా విధించింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ఇటీవలే మిల్లు యాజమాన్యంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన కొన్ని రోజులకే ఈ కఠిన చర్యలు తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల జరిగిన సమీక్షా సమావేశంలో పవన్ కల్యాణ్ ఆంధ్రా పేపర్ మిల్లు వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రి నగరంలో వెలువడుతున్న మొత్తం కాలుష్యంలో దాదాపు సగం ఆంధ్రా పేపర్ మిల్లు నుంచే వస్తోందని ఆయన ఆరోపించారు. నగరం నుంచి రోజుకు 70 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలు

మిగతా .. 2లో..

# తిరుమలలో భక్తుల వెల్లువ

**దర్శనానికి 20 గంటల నిరీక్షణ**



**తిరుమల, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** వారాంతం కావడంతో తిరుమల గిరులు భక్తులతో కిక్కిరిశాయి. దేశం నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం యాత్రికులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొండపై తీవ్ర రద్దీ నెలకొంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో,

మిగతా .. 2లో..

### మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి

# చంద్రబాబులా పారిపోం

**గుడివాడ అమర్నాథ్**



**గుడివాడ, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ కచ్చితంగా పోటీ చేసి తీరుతుందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తమ అధినేత జగన్ ఎప్పుడూ ఎన్నికల బరి నుంచి తప్పించుకునే నాయకుడు కాదని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలు

మిగతా .. 2లో..

# రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

**హైదరాబాద్‌లో ఏర్పాటుకు ముందుకొచ్చిన టీసీఎస్-హైపర్‌వాల్ట్ - దావోస్ చర్చల అనంతరం రికార్డు వేగంతో పట్టాలెక్కిన డీల్**
**ప్రాజెక్టుతో 7 వేల మందికి ఉపాధి అవకాశాలు - సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమక్షంలో ఎంవోయూ కుదుర్చుకున్న సంస్థ ప్రతినిధులు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విప్లవంలో మరో భారీ మైలురాయిని అధిగమించింది. దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) అనుబంధ సంస్థ 'హైపర్‌వాల్ట్' ముందుకొచ్చింది. రూ.70 వేల కోట్ల పెట్టుబడితో ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటు చేసే ఈ డేటాసెంటర్ క్యాంపస్‌తో తెలంగాణ ఐటీ రంగం సరికొత్త శిఖరాలకు చేరుకోనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 7 వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు



సచివాలయంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టీసీఎస్ ప్రతినిధుల బృందం, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు

మిగతా .. 2లో..

# మిస్ వరల్డ్‌గా డొమినికన్ టీచర్



**హనోయ్, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** మిస్ వరల్డ్-2026గా డొమినికన్ సుందరి జోహెరి మోలా డొమింగ్వెజ్ ఎంపికయ్యారు. వియత్నాంలో జరిగిన

మిగతా .. 2లో..




# సరికొత్త ప్రపంచ పటం

**ఆమోదించిన ఐరాస సర్వప్రతినిధుల సభ - భారత్‌సహా 164 దేశాల మద్దతు - వ్యతిరేకించిన అమెరికా**



**ఐరాస, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** వివిధ దేశాలు, ఖండాల వైశాల్యాన్ని కచ్చితంగా చూపే సరికొత్త 'ఈక్వల్ ఏరియా మ్యాప్'ను (నిజ వైశాల్య ప్రపంచ పటం) ఐక్యరాజ్య సమితి ఆమోదించింది. దీంతో 16వ శతాబ్దం నుంచి అమల్లో ఉన్న మర్కేట ప్రపంచ పటం కనుమరుగు కానుంది. కొత్త పటంలో భారత్ ఆఫ్రికాలు ప్రస్తుతాని కంటే పెద్దగా కనిపిస్తాయి. అమెరికా కొంత చిన్నదిగా కనిపించనుంది. పటంలో మాత్రమే ఈ మార్పులు కనిపిస్తాయి. దేశాల వాస్తవ సరిహద్దుల్లో ఎటువంటి మార్పులు ఉండవు. సర్వప్రతినిధుల సభలో జరిగిన ఓటింగ్‌లో సరికొత్త ప్రపంచ పటానికి అనుకూలంగా భారత్ ఓటేసింది. కరెక్ట్ ద మ్యాప్ (పటాన్ని సరిచేయండి)

మిగతా .. 2లో..

### నేపాల్‌లో 10 రోజుల తర్వాత

# సురక్షితంగా మరో ఇద్దరు

**మృత్యుంజయులుగా బయటపడ్డ మహిళ, చైనా జాతీయుడు**



**నువాకోట్, సెప్టెంబర్ 05, విశ్వం వాయిస్ న్యూస్ :** వరద విపత్తుతో విలవిల్లాడిన నేపాల్‌లో అద్భుతం జరిగింది. వరద, శిథిలాలలో కూరుకుపోయిన ఇంట్లో చిక్కుకున్న 60 ఏళ్ల మహిళ మృత్యుంజయురాలిగా బయటపడ్డారు. నాలుగంతస్తుల భవనంలోని పై అంతస్తు నుంచి సహాయ సిబ్బంది ఆమెను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. నువాకోట్ జిల్లాలోని

మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### సాంకేతికత ఎంత పెరిగినా

## టీచర్‌కు ప్రత్యామ్నాయం లేదు

డ్రోన్లు, రోబోటిక్స్ వచ్చాయి" అని చంద్రబాబు అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయ నియామకాలు అత్యంత కీలకమని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం చేసేందుకు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి మెగా డీఎస్సీని నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, భక్తవత్సలం అనే గురువు చేతిలో తాను దెబ్బలు తిన్నానని చెప్పారు. అయితే, గురువుల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. భారతీయ సంస్కృతిలో "మాతృదేవో భవ, పితృదేవో భవ" తర్వాత "ఆచార్య దేవో భవ" అని గురువుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఒక ఉపాధ్యాయుడి స్థానాన్ని మరో ఉపాధ్యాయుడు మాత్రమే భర్తీ చేయగలరని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, బయటి ప్రపంచం గురించి కూడా నేర్చుకోవాలని, ఈ విషయంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు. గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టానని, టెలికాం రంగంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా మారిందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సత్తా చాటుతున్నారని అన్నారు. అమెరికా, ఆసియా దేశాల అభివృద్ధికి జ్ఞానమే పునాది అని, రాబోయే 10-15 ఏళ్లలో భారత్ స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒకప్పుడు సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండగా, ఇప్పుడు పోటీతత్వం పెరిగి విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

### 2013లో ఎలా ఉన్నామో

## ఇప్పుడెలా ఉన్నామో చూడండి

వెన్నువిరిచామని పేర్కొన్నారు. 2013లో దేశం ఎలాంటి పరిస్థితుల్లో ఉండేదో... ఇప్పుడెలా ఉందో చూడాలని యువతకు మోదీ పిలుపునిచ్చారు. శనివారం రాత్రి దిల్లీ విశ్వవిద్యాలయ అనుబంధ శ్రీరాం కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. 2013లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండగా తాను ఇక్కడికి వచ్చి చేసిన ప్రసంగాన్ని ఆయన గుర్తుచేశారు. "2013లో నేను ఎస్ఆర్‌సీసీకి వచ్చినప్పుడు ఓ విజన్‌ను ఆవిష్కరించా. అప్పట్లో మీకు సగం నీటితో ఉన్న గ్లాస్ ఉదాహరణ చెప్పా. కొంత మంది ఆ గ్లాస్ సగం నిండిందని అంటారు. మరి కొందరు సగం ఖాళీగా ఉందంటారని తెలిపా. కానీ నేను మాత్రం సగం నీరు, సగం గాలితో అది పూర్తిగా నిండి ఉందని అంటానని వివరించా. 2013లో అభివృద్ధి అత్యల్ప స్థాయిలో ఉన్నప్పుడు.. ద్రవ్యోల్బణం ఆకాశాన్నంటినప్పుడు.. కుంభకోణాలు పతాక స్థాయిలో జరుగుతున్నప్పుడు.. భయం లేకుండా అవినీతి రాజ్యమేలుతున్నప్పుడు.. ఉగ్రవాదులు కట్టడిలేకుండా చెలరేగుతున్నప్పుడు.. పాకిస్థాన్ అదుపు తప్పినప్పుడే.. నేను పూర్తిగా నిండిన గ్లాస్‌ను చూశా! 12 ఏళ్ల తర్వాత ఇప్పుడు ఉగ్రవాదం పీచమణిచాం. పాకిస్థాన్ ఏ దుశ్చర్యకు పాల్పడకుండా కట్టడి చేశాం. నక్సలిజాన్ని అంతం చేశాం. విధానపరమైన స్తబ్ధత నుంచి చైతన్యం దిశగా సాగాం. ఒకప్పుడు బలహీన దేశంగా పేర్కొన్నవారే ఇప్పుడు వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా కొనియాడుతున్నారు. అప్పట్లో నా ఆశావాదాన్ని కొందరు ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియాపై అనుమానాలు వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఇప్పుడు భారత్ 7.8% వృద్ధి రేటును సాధించింది. అప్పట్లో భారత్‌ను వెనక్కిలాగినవారు ఇప్పుడు దానిని జీర్ణించుకోలేకపోతున్నారు" అని ప్రధాని పేర్కొన్నారు.

**అప్పట్లో ఇదీ పరిస్థితి...**

2013లో దేశ పరిస్థితి ఎలా ఉందో యువత చూడాలని, అప్పట్లో పతాక శీర్షికలను తెలుసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. "అప్పట్లో ఎల్వోసీ వెంట భారతీయ సైనికులు మరణించారన్న వార్తలు పతాక శీర్షికలుగా పత్రికల్లో వచ్చేవి. భారత్ వృద్ధి రేటును ప్రపంచ బ్యాంకు తగ్గించేది. ద్రవ్యలోటు ఆల్‌టైం గరిష్ఠంగా ఉండేది. ద్రవ్యోల్బణం 10శాతంగా ఉండేది. అప్పటి పరిస్థితి ఇప్పటి యువతకు తెలియదని నాకు తెలుసు.

**పూర్వ విద్యార్థులు 'ఓజీ'లు**

ఒక వ్యక్తి వందేళ్లు జీవిస్తే అపార జ్ఞానాన్ని సంపాదించారని, గొప్ప అనుభవం కలిగి ఉన్నారని భావిస్తాం. అదే ఒక సంస్థ వందేళ్లు కొనసాగితే అది విజయాల మహా సముద్రంగా మారుతుంది. తరతరాలను తీర్చిదిద్దిన ఎస్ఆర్‌సీసీ అలాంటిదే. ఇక్కడికి వచ్చినవారు విద్యను అభ్యసిస్తారు. బయటకు వెళ్లినవారు శిల్పాలుగా వెళ్తారు. ఎస్ఆర్‌సీసీ పూర్వ విద్యార్థులు ఎంతో ప్రత్యేకం. మీ భాషలో చెప్పాలంటే 'ఓజీలు" అని ప్రధాని కొనియాడారు. వారిని ధురంధర్‌లతోనూ పోల్చారు. ఎస్ఆర్‌సీసీ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేకంగా రూపొందించిన 100 రూపాయల నాణేన్ని ప్రధాని ఆవిష్కరించారు.

## పిల్లలను తీర్చిదిద్దే పుణ్యకార్యం టీచర్లదే

చేశారు. అనంతరం ఆమె ప్రసంగిస్తూ 'ఉపాధ్యాయుల మార్గదర్శనం వల్లే నా జీవన యాత్రలో ముందడుగు వేసి మీ ముందు నిలవగలిగాను. పాఠశాల విద్యే మన చదువులకు మూలాధారం. జ్ఞానం, నైపుణ్యాలను జీవితంలో ఎప్పుడైనా సాధించొచ్చు. కానీ సత్ప్రవర్తనను చిన్నతనం నుంచే నేర్పాలి. టీచర్లు చెప్పిన పాఠాలను పిల్లలు మరచిపోయినా వారు నేర్పిన గుణగణాలను జీవితాంతం గుర్తుంచుకుంటారు. పిల్లల్లో కొందరు సహజంగానే బిడియంతో ఉంటారు. మరికొందరిలో అపారమైన ప్రతిభ ఉన్నా ఆత్మవిశ్వాసం లోపించి సతమతమవుతుంటారు. అలాంటి వారిని గుర్తించి తీర్చిదిద్దడం టీచర్ల ప్రధాన బాధ్యత. పుష్కరకాలం కిందట మన ప్రాథమిక పాఠశాలల్లో డ్రాపవుట్ రేట్ 4.5% దాకా ఉండేది. ఇప్పుడు అది దాదాపు సున్నాకు చేరుకుంది. ఇంతటి మహత్తర కార్యాన్ని విజయవంతంగా నిర్వహించిన టీచర్లందరినీ అభినందిస్తున్నా' అని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, సహాయ మంత్రులు జయంత్‌చౌధరి, సుకాంత మజుందార్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు స్వీకరించిన వారిలో తెలుగు రాష్ట్రాలతో సంబంధం ఉన్నవారు ఆరుగురు ఉన్నారు.

## వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

పైబడటం వల్ల విశ్రాంతి తీసుకోవాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపిన అయ్యన్న, అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు. మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'బీసీ ఐక్య వేదిక సదస్సు' నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## తిరుమలలో భక్తుల వెల్లువ

క్యూలైన్లు వెలుపలికి విస్తరించాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సాధారణ సర్వదర్శనం భక్తులకు శ్రీవారి దర్శనం కోసం సుమారు 20 గంటల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు కాలినడక మార్గాలు, బయట రింగు రోడ్డు వరకు ఉన్న క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం పాలు, తాగునీరు, అల్పాహారం అందజేస్తూ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇక శుక్రవారం ఒక్కరోజే 68,374 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 35,241 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ద్వారా రూ.4.03 కోట్ల ఆదాయం లభించినట్లు టీటీడీ వెల్లడించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని వృద్ధులు, చంటి పిల్లల తల్లిదండ్రులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తమ ప్రయాణాన్ని, దర్శనాన్ని తగిన జాగ్రత్తలతో ప్లాన్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు 'ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్'ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా ఇదే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి 'మోడల్ ప్రైమరీ స్కూల్' వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం 'లీప్ యాప్'ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

**ప్రతి విద్యార్థి ప్రాణం విలువైందే..**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ విషాదకర ఘటనను ప్రస్తావిస్తూ లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పేరెంట్-టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చుని మాట్లాడిన ఓ విద్యార్థిని రెండు రోజులకే ఆత్మహత్య చేసుకోవడం తనను, ముఖ్యమంత్రిని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. "ప్రతి బిడ్డ ముఖ్యమే, ప్రతి ప్రాణం విలువైందే (ఎవ్రీ చైల్డ్ మ్యాటర్స్, ఎవ్రీ లైఫ్ మ్యాటర్స్). పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ అంటే 'ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్' అని పిల్లలకు నేర్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి ఫూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

### పవన్ కల్యాణ్ ఎఫెక్ట్..

## ఆంధ్రా పేపర్ మిల్లుకు భారీ జరిమానా

ఉత్పత్తి అవుతుండగా, ఒక్క మిల్లు నుంచే 35 మిలియన్ లీటర్ల వ్యర్థాలు గోదావరి పరిసరాల్లోకి విడుదలవుతున్నాయని తెలిపారు. మిల్లు నుంచి విడుదలవుతున్న నీటి నమూనాలను పరీక్షించగా, బీఓడీ, ఫాస్ఫేట్లు, సల్ఫైడ్లు వంటి హానికారక రసాయనాలు నిర్దేశిత ప్రమాణాల కన్నా అత్యధికంగా ఉన్నట్లు తేలిందని వివరించారు. ఈ కాలుష్యం వల్ల గోదావరి నదిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గి జలచరాలకు ముప్పు వాటిల్లుతోందని, దుర్వాసనతో ప్రజారోగ్యం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్యంతో పాటు పన్ను ఎగవేత అంశాన్ని కూడా పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. 2016 నుంచి సుమారు రూ. 21.34 కోట్ల బకాయిలు చెల్లించలేదని ఆయన తెలిపారు. పన్ను చెల్లింపుల నుంచి తప్పించుకునేందుకు మిల్లు యాజమాన్యం పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయిస్తోందని విమర్శించారు. గడిచిన మూడు నెలలుగా పీసీబీ అధికారులు పలుమార్లు సమావేశాలు నిర్వహించినా యాజమాన్యం నుంచి స్పందన కరవైందని తెలిపారు. తక్షణమే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని, షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. 'స్వచ్ఛ గోదావరి - పవిత్ర పుష్కరాలు' లక్ష్య సాధనలో భాగంగా ఈ చర్యలు తీసుకుంటున్నామని, పద్ధతి మార్చుకోకపోతే మిల్లు కార్యకలాపాలను నిలిపివేయడం, ఆస్తులు జప్తు చేయడం, లైసెన్సు రద్దు వంటి కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం తొలి విడతగా భారీ జరిమానా విధించింది. ఇకపైనా యాజమాన్యం తీరు మారకపోతే మరింత కఠినమైన చర్యలు ఎదుర్కోక తప్పదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

### మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి

## చంద్రబాబులా పారిపోం

నిర్వహించినప్పుడు చంద్రబాబు భయపడి పారిపోయారని ఎద్దేవా చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో గెలుపోటములను ప్రజల తీర్పు ద్వారానే తేల్చుకోవాల్సి ఉంటుందన్నారు. స్థానిక పోరును ఎదుర్కొనేందుకు తమ పార్టీ అన్ని విధాలా సమరసన్నాహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటైనప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు వణుకుతున్నాయని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి స్థానిక సమరాన్ని వాయిదా వేసేందుకు, ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు కూటమి నేతలు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలతో తమ అసలు రంగు బయటపడుతుందనే భయంతోనే కూటమి నాయకులు జంకుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## రూ.70 వేల కోట్లతో ఏఐ డేటా సెంటర్

అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నారు. టీసీఎస్ నుంచి ఆ సంస్థ సీఈవో కృతివాసన్, హైపర్‌వాల్ట్ డేటాసెంటర్ సీఈవో దీపేశ్‌నంద, ఉపాధ్యక్షుడు రాజన్న పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ అధికారి ఉదయ్ రుద్రరాజు హాజరయ్యారు. ఈ ఏడాది జనవరిలో దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటాసన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన భేటీలో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనకు పునాది పడింది. కేవలం 8 నెలల వ్యవధిలోనే మిగతా ఐదు పోటీ రాష్ట్రాలను వెనక్కి నెట్టి తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును దక్కించుకోవడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వం టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరపడంతో కొద్దినెలల్లోనే కార్యరూపం దాల్చిందని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

**ప్రభుత్వాలు మారినా పాలసీలో తేడాలు లేవు: సీఎం రేవంత్‌రెడ్డి**

ఎంవోయూ సందర్భంగా టీసీఎస్-హైపర్‌వాల్ట్ ప్రతినిధులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ... "ఏఐ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుంది. దేశానికే ఇది చరిత్రాత్మక ప్రాజెక్టుగా నిలుస్తుంది. ఫ్యూచర్‌సిటీ నా కల. తెలంగాణ రైజింగ్ విజన్‌లో భాగంగా 2034 నాటికి రాష్ట్రంలో ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ కార్యాచరణలో ఏఐ డేటాసెంటర్ ప్రాజెక్టు కీలక ముందడుగు. 1994 తర్వాత రాష్ట్రంలో చంద్రబాబునాయుడు చాలా పెట్టుబడులను తీసుకొచ్చారు. తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి దాన్ని కొనసాగించారు. తర్వాత పదేళ్లపాటు భారాస అధికారంలో ఉంది. ఇతర రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారితే పాలసీలు మారుతుంటాయి. తెలంగాణలో మాత్రం పార్టీల మధ్య రాజకీయాలు, సిద్ధాంతాల పరంగా తేడాలు ఉన్నా పాలసీలపై ఎలాంటి భిన్నాభిప్రాయాలు లేకుండా పెట్టుబడిదారులకు భరోసాగా ఉంటున్నాం. ఫ్యూచర్‌సిటీలో ఏర్పాటు చేసే రేడియల్ రోడ్డుకు భారతరత్న, దివంగత రతన్‌టాటా పేరు పెట్టాం. హైదరాబాద్‌లో ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి టీసీఎస్-హైపర్‌వాల్ట్ ముందుకు రావడం అభినందనీయం. దీన్ని పూర్తిచేసి 2028 జూన్ 2వ తేదీన ప్రారంభించాలని ఆ సంస్థ ప్రతినిధులకు నేను విజ్ఞప్తి చేస్తున్నా" అని సీఎం పేర్కొన్నారు.

**ఏఐ దిగ్గజాలు హైదరాబాద్ వైపు: మంత్రి శ్రీధర్‌బాబు**

"ఈ ఏడాది దావోస్‌లో టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్‌ను కలిసి తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ఆ మేరకు రాష్ట్రంలో రూ.70 వేల కోట్ల పెట్టుబడికి ముందుకు రావడం మా ప్రభుత్వంపై, సీఎం ఆలోచనా విధానంపై ఉన్న విశ్వాసమే కారణం. ఫ్యూచర్‌సిటీకి ఎవరొస్తారని కొందరు మాట్లాడారు. వాటిని తోసిపుచ్చుతూ ఇప్పుడు ఇంత పెద్దమొత్తంలో పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రంలో చేపట్టనున్న తెలంగాణ రైజింగ్ గురించి వివరిస్తున్నాం కాబట్టే పెట్టుబడులు వస్తున్నాయి" అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. టీసీఎస్ సీఈవో కృతివాసన్ మాట్లాడుతూ... ఏఐ వద్ద ఉన్న సమాచారంతో క్లౌడ్, ఇంజినీరింగ్, సమాచార మార్పిడి వంటి వాటిని అనుసంధానిస్తామని, ఇన్ఫ్రాస్ట్రక్చర్-ఇంటెలిజెన్స్ వంటి అంశాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వేగంగా స్పందించి ఈ సెంటర్‌కు కావాల్సిన ఏర్పాట్లను పూర్తి చేసిందని వెల్లడించారు. హైపర్‌వాల్ట్ ఇండియా సీఈవో దీపేశ్‌నంద మాట్లాడుతూ... ఏఐలో భవిష్యత్తు అంశాలను కూడా పరిగణనలోకి తీసుకొని మౌలిక వసతులను కల్పిస్తామని తెలిపారు. హైపర్‌వాల్ట్ ఉపాధ్యక్షుడు రాజన్న మాట్లాడుతూ... ప్రస్తుతం టీసీఎస్ ద్వారా 83 వేల మంది ఉద్యోగాలు చేస్తున్నారని, ఏఐ డేటాసెంటర్ ఏర్పాటుతో మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఐటీ, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మిస్ వరల్డ్‌గా డొమినికన్ టీచర్

73వ మిస్ వరల్డ్ పోటీలో ఆమెను కిరీటం వరించింది. స్పెయిన్‌కు చెందిన ఎలిజబెత్ రెయిన్స్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మలేసియాకు చెందిన తనూసియా చెట్టి తృతీయ స్థానం దక్కించుకున్నారు. జోహెరి టీచర్‌గా, సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్నారు. పేద పిల్లలకు తన సంస్థ ద్వారా ఆంగ్లం నేర్పిస్తున్నారు. భారత్‌కు చెందిన మిస్ ఇండియా వరల్డ్-2024 నికిత పోర్వాల్ టాప్ 40 మందిలో చోటు సంపాదించినా టాప్ 20 వరకు చేరుకోలేకపోయారు.

## సరికొత్త ప్రపంచ పటం

అనే నినాదంతో టోగో దేశం ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి 193 మంది సభ్యులు కలిగిన ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధుల సభలో 164 దేశాలు అనుకూలంగా ఓటేశాయి. తీర్మానానికి వ్యతిరేకంగా ఓటేసిన ఏకైక దేశం అమెరికా కావడం గమనార్హం. 16వ శతాబ్దంలో నౌకాయనం కోసం రూపొందించిన మర్కేట పటాన్ని ఐరాస తీర్మానం కాలం చెల్లినదిగా ప్రకటించింది. ప్రపంచ పటాన్ని మరింత కచ్చితంగా చూపే కొత్త పటాన్ని ప్రామాణికంగా ప్రకటిస్తూ ఐరాస ప్రవేశపెట్టిన తీర్మానం ఉద్దేశాన్ని మేం స్వాగతిస్తున్నాం అని ఐరాసలో భారత ప్రతినిధి రఘు పురీ పేర్కొన్నారు.

**పాత పటంతో సమస్య ఏమిటి?**

మర్కేట ప్రపంచ పటాన్ని కేవలం నౌకా యానం కోసం రూపొందించారు. ఉత్తర, దక్షిణ ధ్రువాల సమీపంలోని ప్రాంతాల పరిమాణాన్ని పెద్దగా, భూమధ్య రేఖకు సమీపంలోని ప్రదేశాల వైశాల్యం చిన్నగా ఉన్నట్లు ఈ పటం చూపుతోంది. భూమి గోళాకారంగా ఉండటంవల్ల కేవలం పొడవు, వెడల్పు అనే రెండు పరిమాణాల ఆధారంగా చూపే పటంలో భూమధ్య రేఖకు సమీపంలో ఉన్న ప్రాంతాల వైశాల్యం చిన్నగా ఉందన్న అపోహ కలుగుతోంది. ఆ కారణంగానే గ్రీన్‌లాండ్ ఆఫ్రికాతో సమానమైన పరిమాణం కలిగి వున్నట్లు ఆ పటం చూపుతోంది. నిజానికి ఆఫ్రికా ఖండం గ్రీన్‌లాండ్ కన్నా 14 రెట్లు పెద్దగా ఉంది.

**అమెరికా ఎందుకు వ్యతిరేకిస్తోంది?**

మర్కేట పటంలో అమెరికా పరిమాణం వాస్తవ వైశాల్యం కన్నా పెద్దగా ఉన్నట్లు కనపడుతోంది. కొత్త పటం ఈ లొసుగును సవరించి అమెరికా అసలు వైశాల్యాన్ని చూపనుంది. దాంతో పటంలో అది కొంత చిన్నగా కనిపించనుంది. అందుకే ప్రపంచ పటంపై చర్చ అర్థరహితమని అమెరికా చెబుతోంది.

**భారత్ మరింత పెద్దదిగా...**

కొత్తగా ప్రామాణీకరించిన నిజ వైశాల్య పటం ఇతర దేశాలతో పోల్చుకుంటే భూమధ్య రేఖకు కొంత దగ్గరగా ఉన్న భారత్ వంటి దేశాల సరైన వైశాల్యాన్ని చూపుతుంది. అంటే ప్రపంచ పటంపై భారత్ మరింత పెద్దదిగా దర్శనమిస్తుంది.

## సురక్షితంగా మరో ఇద్దరు

బిదుర్ పట్టణంలో ఆ మహిళ బయటపడటానికి సంబంధించిన వీడియోను నేపాల్ పోలీసులు సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహాయక సిబ్బంది ఇంటివద్ద పేరుకుపోయిన బురదను, మట్టిని తొలగిస్తూ.. పై అంతస్తులోని కిటికీలో నుంచి చందిక శ్రేష్ఠ అనే మహిళను బయటకు తీసుకొచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆ మహిళ.. సిబ్బంది బయటకు తీసుకొచ్చాక స్పృహలోకి వచ్చారు. అనంతరం ఆమెను హెలికాప్టర్‌లో త్రిశూలిలోని మైథిలి బ్యారక్‌కు, అక్కడి నుంచి కాఠ్‌మాండూకు తీసుకెళ్లారు. రసువా జిల్లాలోని అప్పర్ త్రిశూలి 1 జల విద్యుత్తు ప్రాజెక్టులో చిక్కుకున్న లుహైతావో అనే చైనా జాతీయుడిని శనివారం సహాయక సిబ్బంది రక్షించారు. 10 రోజుల తర్వాత ఆయన బయటపడటం విశేషం. టన్నెల్‌లోని 225 మీటర్ల లోపల ఆయన చిక్కుకున్నారు. ఇదే టన్నెల్ నుంచి శుక్రవారం ఇద్దరిని రక్షించిన సంగతి తెలిసిందే. పెరుగుతున్న మృతుల సంఖ్య: నేపాల్‌లో పెను విపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 1,344కు చేరుకుంది. ఇంకా 5,000 మంది జాడ తెలియడం లేదు. ఇందులో 589 మంది విదేశీయులున్నారు. ఇప్పటిదాకా 13,000 మందిని సహాయక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇప్పటిదాకా 1,030 మృతదేహాలకు అధికారులు అంత్యక్రియలు నిర్వహించారు. వారి డీఎన్ఏలను భద్రపరిచారు. 96 మృతదేహాలను బంధువులకు అప్పగించారు.

# ఎడిటర్ వాయిస్

## పులివెందుల.. పులులెవరు..?

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని చోట్ల గెలిస్తే ఏంటి.. వైసీపీకి ప్రాబల్యం ఉన్న కడప జిల్లాను కొట్టాలి కానీ! ఇదీ.. తరచుగా టీడీపీలో వినిపిస్తున్న మాట. ఈ నేపథ్యంలోనే కడపను కేంద్రంగా చేసుకుని.. పార్టీ పెద్ద ఎత్తున వ్యూహాలు రచిస్తోంది. ముఖ్యంగా జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో పాగా వేయడంతో పాటు.. ఇక్కడి స్థానిక ఎన్నికల్లో పూర్తిస్థాయి ఏకగ్రీవాలకు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ఈ క్రమంలో మంత్రులు సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి, ఫరూక్‌ల నేతృత్వంతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పులివెందుల నియోజకవర్గంలో పార్టీకి బలాబలాలను అంచనా వేయడంతోపాటు.. కడప జిల్లాలో టీడీపీ దూకుడును కూడా లెక్కించనుంది. తద్వారా స్థానిక ఎన్నికల్లో పులివెందులను ఒంటిచేత్తో తీసుకురాగల పులల కోసం అన్వేషిస్తోంది. అయితే.. ఇక్కడ డౌట్ రావొచ్చు. ఆల్రెడీ.. బీటెక్ రవి ఉన్నారు కదా.. ఆయన చూసుకుంటారు కదా!.

ఆయన ప్రాధాన్యం ఏమాత్రం తగ్గించకుండా.. ఆయనకు దన్నుగా .. మంత్రి లోకేష్ ఈ ప్రయత్నాలు ము మ్మరం చేశారు. ఇప్పటి వరకు చేసిన అభివృద్ధితోపాటు.. ఇటీవల వెలిగొండ ద్వారా కడపలోని 8 మండలాలకు ఇస్తున్న నీరు.. అలానే పట్టిసీమ ద్వారా పులివెందులకు ఇప్పటికే పారుతున్న సాగునీరు వ్యవహారాలను హైలెట్ చేసి.. స్థానికంలో విజయం దక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అలానే.. సరికొత్త వ్యూహాలు వేస్తున్నారు.

ప్రస్తుతం పులివెందులను తమ ఖాతాలో వేసుకునే ప్రయత్నంలో భాగంగానే మంత్రుల కమిటీని ఏర్పాటు చేశారు. దీంతో పాటు.. వైసీపీ అసంతృప్తులు.. బలమైన నాయకులను కూడా చేర్చుకునేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మొత్తంగా స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేదా.. పోటీ ఉంటే.. పులుల తరహా నాయకుల ను కూడా ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఈ ప్రయత్నాలు సాఫీగా సాగుతాయన్నది పార్టీ చెబుతున్న మాట. ప్రస్తుతం వైసీపీకి బలం తగ్గడం.. నియోజకవర్గంలోనూ కదలికలు లేకపోవడం వంటివి తమకు లాభిస్తాయన్న వాదన టీడీపీలో వినిపిస్తోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైమ్ వాయిస్

## పనీర్, డెయిరీ ఉత్పత్తి కేంద్రాలపై టీజీ సేఫ్ దాడులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** నగరంలోని పనీర్, డెయిరీ ఉత్పత్తుల తయారీ కేంద్రాలపై టీజీ సేఫ్ అధికారుల దాడులు చేశారు. 12 ప్రత్యేక బృందాలతో 14 డెయిరీ యూనిట్లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, పోలీస్ సిబ్బంది, హెచ్ ఫాస్ట్ అధికారులు ఈ సోదాల్లో పాల్గొన్నారు. కొన్ని యూనిట్లలో పనీర్ తయారీలో పామాయిల్, గ్లిసరాల్ మోనోస్టియరేట్ వినియోగాన్ని గుర్తించారు. తనిఖీల సందర్భంగా పలు చోట్ల పారిశుద్ధ్యం, పరిశుభ్రత లోపాలు వెలుగుచూశాయి. పలు డెయిరీ యూనిట్లలో బొద్దింకలు, ఈగల తిరుగుతుండటాన్ని గమనించారు. పలు కేంద్రాల్లో పాల సేకరణకు సంబంధించిన రికార్డులు లేవు. కల్తీపై అనుమానంతో 21 ఆహార నమూనాలను అధికారులు సేకరించారు. దాదాపు రూ.7.19 లక్షల విలువైన ఆహార పదార్థాలను సీజ్ చేశారు. దాదాపు టన్ను పామాయిల్, 476 కిలోల గ్లిసరాల్ మోనోస్టియరేట్‌ను, 150 కిలోల స్కిమ్డ్ మిల్క్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. మేవీస్ క్లాసిక్ ప్రీమియం కుకింగ్ క్రీమ్‌కు చెందిన 1,760 ప్యాకెట్లు జప్తు చేశారు. మూడు డెయిరీల ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు సస్పెండ్ చేశారు. గగన్‌పహాడ్‌లోని ఓ డెయిరీ కేంద్రం కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు ఇచ్చారు.

## నీట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థి బలవన్మరణం



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానసిక ఒత్తిడి తట్టుకోలేక నీట్ శిక్షణ తీసుకుంటున్న ఓ విద్యార్థి గాజువాకలోని ఓ కోచింగ్ సెంటర్ మూడంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బలవన్మరణానికి ముందు ఆత్మహత్య చేసుకొనే విధానంపై సామాజిక మాధ్యమాల్లో సెర్చ్ చేయడం గమనార్హం. సీఐ వాసు నాయుడు తెలిపిన వివరాల మేరకు.. అనకాపల్లికి చెందిన రమేష్, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు రూపేశ్ (19) నీట్ లాంగ్ టెర్మ్ కోచింగ్ నిమిత్తం పాత గాజువాకలో ఓ అపార్టుమెంట్‌లోని ప్రైవేటు కోచింగ్ సెంటర్‌లో చేరాడు. రోజూ అనకాపల్లి నుంచి వస్తుండేవాడు. శుక్రవారం మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో దిగులుగా ఉండడాన్ని తోటి విద్యార్థులు గమనించారు. తాను ఫీజు చెల్లించి వస్తానని చెప్పి మూడో అంతస్తుకు చేరుకొన్న రూపేశ్.. అక్కడి నుంచి దూకినట్లు పోలీసులు తెలిపారు. గాయాలపాలైన యువకుడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి ఫోన్‌లోని చాట్ జీపీటీ, గూగుల్ హిస్టరీలో ఆత్మహత్య చేసుకొనే విధానంపై సెర్చ్ చేసినట్లు తేలింది. అతని బ్యాగులో ఫిట్స్ మాత్రల ఖాళీ స్ట్రిప్స్‌ను గుర్తించారు.

### అప్పుల బాధ తాళలేక..

## గోదావరిలోకి దూకిన కుటుంబం

**తణుకు, విశ్వం వాయిస్ న్యూస్ :** అప్పుల బాధ తాళలేక ఓ కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఘటన పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం చించినాడ బ్రిడ్జి వద్ద చోటుచేసుకుంది. తణుకుకు చెందిన నంబూరు శ్రీనివాస్, పద్మిని దంపతులు స్థానికంగా కిరాణా, పాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వ్యాపారం అంతంతమాత్రంగానే సాగుతుండటం, అప్పుల ఒత్తిడి పెరగడంతో.. కుమారుడు (16), కుమార్తె (12)తో కలిసి దంపతులు శనివారం తెల్లవారుజామున చించినాడ బ్రిడ్జి పైనుంచి నదిలోకి దూకారు. ఈ ఘటనలో పద్మినిని జాలర్లు రక్షించగా.. శ్రీనివాస్‌తోపాటు ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. అపస్మారక స్థితిలోకి చేరిన పద్మినిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శ్రీనివాస్ సొంతూరు భీమవరంలోని మత్స్యపురి కాగా.. 20 ఏళ్ల క్రితం తణుకు వచ్చి స్థిరపడ్డారని స్థానికులు తెలిపారు. కుమారుడు పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం, కుమార్తె స్థానిక ప్రైవేట్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇటీవలే తణుకు మండలం వేల్పూరుకు చెందిన దంపతులు అదే ప్రాంతంలో గోదావరిలోకి దూకిన ఘటనలో భర్త మృతి చెందగా, భార్య ఆచూకీ నేటికీ లభ్యం కాలేదు. పది రోజుల వ్యవధిలో మరో కుటుంబం అదే ప్రాంతంలో నదిలోకి దూకడంతో స్థానికంగా విషాదం నెలకొంది.

### శంషాబాద్‌లో బైక్‌ను ఢీకొట్టిన ట్యాక్సీ..

## ఎయిర్‌పోర్ట్ ఉద్యోగిని మృతి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మార్గంలో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను ట్యాక్సీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఎయిర్‌పోర్ట్ ఉద్యోగిని రాధిక, ఆమె స్నేహితుడికి తీవ్రగాయాలయ్యాయి. రాధిక మృతిచెందగా.. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ట్యాక్సీ డ్రైవర్ ఉమాకాంత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదానికి సంబంధించిన దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి.



# పేదలకు అండగా వైపి రావు చారిటబుల్ ట్రస్ట్

## ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించిన జడ శ్రావణ్ కుమార్



**భట్టిప్రోలు, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో వై పి రావు చారిటబుల్ ట్రస్ట్ ప్రధాన కార్యాలయాన్ని మాజీ న్యాయమూర్తి జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రధాన కార్యాలయ ప్రారంభోత్సవ సభ యన్నం పార్వతీశ్వర రావు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ యన్నం సురేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాల నుండి వై పి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని దానిలో భాగంగానే సమాజ శ్రేయస్సు ధ్యేయంగా పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న వై పి రావు చారిటబుల్ ట్రస్ట్ తన సేవా ప్రస్థానంలో మరో కీలక అడుగు వేయబోతుందన్నారు.ట్రస్ట్ కార్యకలాపాలను మరింత విస్తృతం చేస్తూ ప్రజలకు నిరంతర సేవలను అందించేందుకు ప్రధాన కార్యాలయాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నటువంటి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యన్నం సురేష్ చేస్తున్న సేవలు అభినందనీయమని ఆయన అన్నారు. యన్నం పార్వతీశ్వర రావు చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ యన్నం సురేష్ మాట్లాడుతూ ఈ ట్రస్ట్ ద్వారా విద్యా వికాసం, ఉచిత వైద్యం, ఆరోగ్యం,ఆపత్కాల సహాయం, పునరావాసం, సామాజిక భరోసా, మానవతా సేవ, మహిళా సాధికారత, గ్రామీణ అభివృద్ధి, క్రీడలు,పర్యావరణ పరిరక్షణ మొదలుకు కార్యక్రమాలు చేయడం జరుగుతుందని తెలిపారు.అనంతరం అగ్ని ప్రమాద బాధితులైన ఆళ్ళమూడి గ్రామానికి చెందిన కనపర్తి రెబ్బమ్మ కు మరియు చినపులివర్రు గ్రామానికి చెందిన దాసు లకు నిత్యవసర సరుకులు,వంట సామాగ్రి,దుస్తులు పంపిణీ చేశారు.25 మంది వృద్ధులకు,వితంతువులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు.అనంతరం ప్రముఖ న్యాయవాదులు దారం సాంబశివరావు, ఉమ్మడి రవి రాజు లను మరియు పత్రికా విలేకరులు కుంచె వెంకటేశ్వరరావు, సోమశేఖర్,కనపర్తి విక్టర్ ప్రసాద్,కిషోర్, మహబూబ్ సుభాని లను జడ శ్రావణ్ కుమార్ దుశ్శాలువాలతోను పూలమాలలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో దారం సాంబశివరావు, గుమ్మడి రవిరాజు, పరిశా సురేష్, రామారావు,జంగం వాసు,మాన్యం దుర్గాప్రసాద్, ఆలూరి మల్లేశ్వరి, జాన్ శ్రీ, కొఠారి రాణి, పరిష ప్రసన్న, బొలిమేర రాజు, తోట శ్రీనివాసరావు షణ్ముఖ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కడలి వారి వివాహ వేడుకలో

# పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** సీతానగరం మండలం రఘుదేవ పురం గ్రామంలో సాయిబాబా గుడి వద్ద ఘనంగా జరిగిన కడలి శ్రీనివాసరావు కుమారుడి వివాహ రిసెప్షన్ వేడుకలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పాల్గొని నూతన వధూవరులు వెంకటసాయి - జాహ్నవి లను ఆశీర్వదించి శుభా కాంక్షలు తెలియజేసారు.వీరి వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో పలు కుటుంబాలను

# పరామర్శించిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో జనసేన పార్టీ నాయకులు కారిచర్ల విజయ్ శంకర్ మాతృ మూర్తి కారిచర్ల మాలతి, మండ రాంబాబు చిన్నాన్న మండా శేషయ్య స్వర్గస్తులైనారని తెలుసుకుని వారిని పరామ ర్శించి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పడం జరిగింది. వీరి వెంట జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తప్పులతో నిండిన ఓటర్ల జాబితా

## సమన్వయంతో ప్రతి వార్డు సరిహద్దులను పరిశీలించాలి + వైసీపీ కేడర్‌కు దిశానిర్దేశం



**మండపేట టౌన్, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాల్సిన సమయం ఆసన్నమైందని ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు), యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు తోట పృథ్వీరాజ్ అన్నారు. ఎన్నికల అధికారులు అందజేసిన ఓటర్ల జాబితా తప్పులతో కూడి ఉందని, వార్డుల వారీగా జాబితాలను బీఎల్ఏలు, వార్డు కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. విజయలక్ష్మి నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం బీఎల్ఏలు, వార్డు నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశాల మేరకు పార్టీ టౌన్ కన్వీనర్ పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజబాబు, పృథ్వీరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు విడుదల చేసిన ఓటర్ల జాబితాపై చర్చించారు. మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పులు ఉంటే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారు. కొత్తగా ఏర్పడిన 36 వార్డులకు సంబంధించి పార్టీ కార్యాలయానికి అందిన ఓటర్ల జాబితా అధికార పార్టీకి అనుకూలంగా ఉందని ఆరోపించారు. ఇటీవల నిర్వహించిన ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రూపొందించిన జాబితా విడుదల కాకుండా, పాత జాబితానే మళ్లీ విడుదల చేశారని పేర్కొన్నారు. 36 వార్డుల పార్టీ ఇన్‌చార్జిలు, బూత్ ఏజెంట్లు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు సమన్వయంతో ప్రతి వార్డు సరిహద్దులను పరిశీలించాలని సూచించారు. ఓటర్ల జాబితాల్లో మరణించిన వ్యక్తుల పేర్లు, రెండుసార్లు నమోదైన ఓట్లు, ఇతర ప్రాంతాలకు తరలిపోయిన వారి పేర్లు తదితర తప్పులను గుర్తించి, బూత్ ఏజెంట్ల ద్వారా ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. జాబితాలను పూర్తిస్థాయిలో పరిశీలించి ఎన్నికలకు సిద్ధం కావాలని సూచించారు. పార్టీ కార్యకర్తల ఓట్లు తొలగిపోయినట్లయితే ఫారం 6 ద్వారా తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పించే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిజిటల్ మేనేజర్, ఐటీ విభాగం అధ్యక్షుడు యరమాటి వెంకన్నబాబు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు పోతంశెట్టి ప్రసాద్, ముమ్మిడివరపు బాపిరాజు, నాయకులు పలివెల సుధాకర్, కోనాల చంద్రబోస్, పిల్లా వీరబాబు, మందపల్లి రవికుమార్, మెండు బాపిరాజు, షేక్ అలీఖాన్ బాబా, ముక్కా దాలయ్య, మొండి మురళి, పెంకే గంగాధర్, కోళ్ళ శ్రీనివాస్, పార్టీ వార్డు అధ్యక్షులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


# మోడీ క్రికెట్ లీగ్ ఫైనల్లో రామ్ చరణ్ లెవెన్ ఘన విజయం

## నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా ఎమ్‌సిఎల్ - ట్రోఫీ అందజేసిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

**అమలాపురం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** అమలాపురం పట్టణంలోని బాలయోగి స్టేడియంలో నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మోడీ క్రికెట్ లీగ్ (ఎమ్ సి ఎల్) ఫైనల్ మ్యాచ్ శనివారం ఉత్కంఠభరితంగా సాగింది. రామ్ చరణ్ లెవెన్, బీసీసీఏ డ్రాగన్స్ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో రామ్ చరణ్ లెవెన్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించింది. అనంతరం నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్ కుమార్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, అమలాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ అధికారి జయలక్ష్మి, వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ కంచిపల్లి అబ్బులు, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లా చిట్టిబాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, ది ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెరుకూరి సాయిరాం తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫైనల్లో విజేతగా నిలిచిన రామ్ చరణ్ లెవెన్ జట్టుకు విజేత ట్రోఫీతో పాటు రూ.50 వేల నగదు బహుమతి చెక్కును అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన బీసీసీఏ డ్రాగన్స్ జట్టుకు రన్నరప్ ట్రోఫీతో పాటు రూ.25 వేల నగదు బహుమతి చెక్కును అందించారు. అలాగే టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, మ్యాన్ ఆఫ్ ది టోర్నమెంట్ విజేతలకు ప్రత్యేక ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మోడీ క్రికెట్ లీగ్ వంటి క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు,




పట్టుదల, జట్టుగా పనిచేసే స్ఫూర్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నల్లా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎమ్ సి ఎల్ ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడం అభినందనీయమని, భవిష్యత్తులోనూ యువతను ప్రోత్సహించే మరిన్ని క్రీడా కార్యక్రమాలను నిర్వహించాలని ఆకాంక్షించారు. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఇరు జట్ల ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. విజేతగా నిలిచిన రామ్ చరణ్ లెవెన్ ఆటగాళ్లను నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి డీవీఎస్ రాజు, బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కొండేటి జయలక్ష్మి, సీనియర్ నాయకులు గోకరకొండ గంగన్న స్వామి, యనమదల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



## డీఎస్పీ శ్రీహరి రావును అభినందించిన జిల్లా ఎస్పీ



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** ఈ నెల 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు గుంటూరు జిల్లా అమరావతిలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2026లో డీఎస్పీ మరియు అంతకంటే ఉన్నత స్థాయి అధికారులతో కూడిన గెజిటెడ్ ఆఫీసర్స్ కేటగిరీలో కాకినాడ జిల్లా తరఫున పాల్గొన్న ఏఆర్ డీఎస్పీ శ్రీ వి.జి. శ్రీహరి రావు విశిష్ట ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. లాన్ టెన్నిస్ సింగిల్స్‌లో బంగారు పతకం, లాన్ టెన్నిస్ డబుల్స్‌లో బంగారు పతకం, టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించి కాకినాడ జిల్లా పోలీసులకు గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందుమాధవ్, వి.జి. శ్రీహరి రావును తమ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. గెజిటెడ్ ఆఫీసర్స్ విభాగంలో అద్భుతమైన ప్రతిభ కనబరిచి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## ప్రజా ఫిర్యాదులను అత్యంత పగడ్బందీగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ ఎంఎస్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక నెల -ఒక గ్రామం 4 సందర్శనలు కార్యక్రమం కింద అందిన అర్జీలను అత్యంత పగడ్బందీగా, ప్రత్యేక దృష్టితో పరిష్కారంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దాపురం నియోజకవర్గం స్థాయిలో పెద్దాపురం మండలం ఎంపీడీవో నిర్వహించిన 'ఒక నెల - ఒక గ్రామం - నాలుగు సందర్శనలు' కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్.. ట్రైనీ కలెక్టర్ ప్రియ ఇతర అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు, అర్జీలను స్వయంగా స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. తొలుత భారత తొలి ఉపరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి నెలా ఒక నియోజకవర్గం చొప్పున నాలుగు సార్లు శుక్రవారం ఆ నియోజకవర్గంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పెద్దాపురం నియోజకవర్గ స్థాయిలో ఒక నెల -ఒక గ్రామం నాలుగు సందర్శనలు కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం కింద అందిన అర్జీల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి అత్యంత పకడ్బందీగా పరిష్కరించాలన్నారు. ఈ వారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో దాదాపు 52 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్ పర్సన్ రాజా సూరిబాబు రాజా, పెద్దాపురం ఎంపీడీవో కెవీ. సూర్యనారాయణ, తహసీల్దార్ పి. శ్రీనివాసు, నియోజకవర్గంలోని ఇతర మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, డివిజన్,మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# ఉపాధ్యాయుల కృషితోనే సమాజ ప్రగతి

### గురువులను గౌరవించే సమాజమే అభివృద్ధిలో ముందంజ
### 34 మంది ఉపాధ్యాయులను సత్కరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



**ద్రాక్షారామం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువులను గౌరవించిన ఏ సమాజమైనా అభివృద్ధి పథంలో ముందంజలో ఉంటుందని, గురువులు బోధించిన జ్ఞానం, క్రమశిక్షణ, విలువలే విద్యార్థులను ఉన్నత శిఖరాలకు చేర్చుతాయని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. గురువులను నిరంతరం స్మరించుకుంటూ వారి మార్గదర్శకత్వంలో నడిచే వారు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులే మూలస్తంభాలని కొనియాడారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ద్రాక్షారామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించిన టీచర్స్ డే వేడుకలకు మంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో సేవలందిస్తున్న 34 మంది ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఇటీవల ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో ద్రాక్షారామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సాధించిన విజయాలు ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థిని కోన అభిశ్రీ 593 మార్కులతో జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించడం, 37 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు పొందడం, ఐదు మంది విద్యార్థులు ఐఐటీ సీట్లు సాధించడం పాఠశాల ఉపాధ్యాయుల అంకితభావం, కృషికి నిదర్శనమని ప్రశంసించారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను తీర్చిదిద్దుతున్న పాఠశాల తన నియోజకవర్గంలో ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి అన్నారు. విద్యార్థుల విజయాల వెనుక ఉపాధ్యాయుల శ్రమ, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదల సమానంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలికలు విద్యారంగంలో విశేష ప్రతిభ కనబరుస్తున్నారని, సమాజ అభివృద్ధికి మహిళా విద్య అత్యంత కీలకమని చెప్పారు. స్త్రీలను గౌరవించే సమాజమే నిజమైన అభివృద్ధిని సాధిస్తుందని పేర్కొంటూ విద్యార్థులు విద్యతో పాటు విలువలు, సంస్కారం, క్రమశిక్షణను అలవర్చుకోవాలని సూచించారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ, జ్ఞానాన్ని పంచి సమాజ అభివృద్ధికి మార్గదర్శకులుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు సేవలు చిర స్మరణీయమని ప్రశంసించారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, రామచంద్రపురం రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, టేకుమూడి సత్యనారాయణ, ముప్పనపల్లి గణేష్, మాజీ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, రవ్వా భూషణం, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్, డీఆర్కే, ఆళ్ల బుజ్జి, బీజేపీ మండల అధ్యక్షులు అకేటి కృష్ణ, శివాజీ, కర్రా నాగేశ్వర్, ఇన్‌చార్జి హెచ్ఎం మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి స్టాఫ్ సెక్రటరీ అరవ విస్సు వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

# టీడీపీ కార్యకర్తను వైసీపీ కార్యకర్తగా చూపించే కుట్ర

### వైసీపీ పార్టీ కండువా కప్పి పార్టీ మారినట్లు తప్పుడు ప్రచారం.. వైసీపీ చౌకబారు రాజకీయాలు
### కండువా కప్పితే పార్టీ మారినట్టేనా?.. వైసీపీ తీరుపై టీడీపీ నేతలు ఆగ్రహం
### టీడీపీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం జెండా కిందే : మట్ట భద్రరావు స్పష్టం - ఓటమి భయంతోనే వైసిపి జిమ్మిక్కులు : మంత్రి సుభాష్




**రామచంద్రపురం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో వైసీపీ నాయకులు బలవంతపు పార్టీ మార్పుల పేరుతో చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నారని 26వ వార్డు సీనియర్ టీడీపీ నాయకుడు మట్ట భద్రరావు ఆరోపించారు. తాను టీడీపీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీ కార్యకర్తగానే కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి 26వ వార్డు గొల్లల వీధిలో వైసీపీ నాయకులు పిల్లి సూర్యప్రకాష్, మాజీ ఎంపీ సుభాష్ చంద్రబోస్ పర్యటించిన సమయంలో తనకు అకస్మాత్తుగా వైసీపీ కండువా కప్పి ఫొటో తీశారని భద్రరావు తెలిపారు. అనంతరం తాను వైసీపీలో చేరినట్లు తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై శనివారం ఉదయం టీడీపీ కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యంలను కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. తాను ఎలాంటి పార్టీ మార్పు చేయలేదని, టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి విధేయుడిగా ఉన్నానని భద్రరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో వైసీపీ నాయకులు ఇలాంటి చౌకబారు ప్రచారాలకు పాల్పడటం హాస్యాస్పదమన్నారు. ప్రజలను, టీడీపీ కార్యకర్తలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు నమ్మరని అన్నారు. టీడీపీ కార్యకర్తల సంక్షేమంతో పాటు రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయకేతనం ఎగురవేస్తాయని మంత్రి సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. కండువా కప్పి ఫొటో తీసినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు.. ప్రజల నమ్మకాన్ని, కార్యకర్తల నిబద్ధతను ఫొటోలతో మార్చలేరు అని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దంగేటి గౌరీశంకర్, వాసంశెట్టి బాల, కంచుమర్తి బాబురావు, 26వ వార్డు అధ్యక్షుడు మన్ని భద్రరావు, టీడీపీ సీనియర్ నాయకుడు కిలారుపు బద్రీనాథ్, మట్టా వెంకటరామయ్య, మన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అద్వితీయం

### 61 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**అమలాపురం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** యువత మనసులను తీర్చిదిద్దడంలో, బలమైన సమాజాన్ని నిర్మించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారని జిల్లా జాయింట్ కలెక్టర్ వై.ఖోమ్ నైడియా దేవి తెలిపారు. ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి అనంత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చేటి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారి వ్యక్తిత్వ వికాసానికి, ఉన్నత లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయుల బోధన, మార్గదర్శకత్వం ఎంతో అవసరమని అన్నారు. నేటి సమాజంలో ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు, న్యాయవాదులు, శాస్త్రవేత్తలుగా వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి విజయాల వెనుక పాఠశాల స్థాయి ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని పేర్కొన్నారు. దేశ రెండో రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయుల దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషదాయకమన్నారు. సమాజంలో తల్లిదండ్రులు, గురువులు నిత్య పూజనీయులని, అలాంటి ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా 61 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ మహబూబ్ బాషా మాట్లాడుతూ కోనసీమ జిల్లా రాష్ట్ర స్థాయిలో విద్యాపరంగా ఉత్తమ స్థానంలో నిలవడానికి అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులే కారణమని అన్నారు. ఉపాధ్యాయులు వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చేటి చంద్రమౌళి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి కేవలం పురస్కారాలు, అవార్డులకే పరిమితం కాదని, విద్యార్థుల ఆలోచనా విధానంలో, జీవితంలో తీసుకొచ్చే సానుకూల మార్పే ఉపాధ్యాయులకు అసలైన విజయమని అన్నారు. బోధన పవిత్రమైన బాధ్యత అని, ఓర్పు, సహనం, ప్రేమ, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులే విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల ఆర్థిక సహకార సంస్థ చైర్‌పర్సన్ రెడ్డి అనంత కుమారి మాట్లాడుతూ సమాజ మార్పు, దేశ నిర్మాణం, యువత భవిష్యత్తును తీర్చిదిద్దే మార్గదర్శకులు ఉపాధ్యాయులని అన్నారు. వారి బోధనా విధానం ద్వారా విద్యార్థులు మరింత అభివృద్ధి చెందుతారని తెలిపారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.సుబ్బారావు, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.మమ్మీ, జిల్లా విద్యాశాఖ ఏడీ నక్కా సురేష్, డీవైఈవోలు డి.సురేష్‌కుమార్, కె.వెంకటేశ్వరరావు, పి.రామలక్ష్మణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సావిత్రిబాయి పూలేకు
# భారతరత్న ఇవ్వాలని చిన్నారి నిరసన




**ద్రాక్షారామ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం నియోజకవర్గం ద్రాక్షారామలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో యాట్ల వైష్ణవి సిరి మహాలక్ష్మి అనే చిన్నారి భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు శ్రీమతి సావిత్రిబాయి పూలే వేషధారణలో అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్థానిక సావిత్రిబాయి పూలే విగ్రహానికి ఆ చిన్నారి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించింది. అనంతరం మహిళల విద్య కోసం, సామాజిక సమానత్వం కోసం ఆమె చేసిన గొప్ప త్యాగాలను స్మరిస్తూ, కేంద్ర ప్రభుత్వం స్పందించి దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'భారతరత్న'ను సావిత్రిబాయి పూలేకు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్లకార్డుతో నిరసన తెలిపింది. బాలిక స్వయంగా సావిత్రిబాయి పూలే వేషధారణలో నిరసన తెలుపుతున్న ఈ కార్యక్రమం స్థానికంగా అందరి ప్రశంసలను అందుకుంది.

### రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో
# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**రామచంద్రపురం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల అభివృద్ధికి విశేష సేవలు అందించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోధనా సిబ్బంది విభాగంలో జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్. శ్రీనివాస్, ఆంగ్ల అధ్యాపకులు ఎం.డి. షహజాది బేగం, వాణిజ్య అధ్యాపకులు జి.సత్య దుర్గారావు సత్కారం అందుకున్నారు. బోధనేతర సిబ్బంది విభాగంలో జూనియర్ అసిస్టెంట్ కె.వి.ఆర్.జె. స్వరూప్, హెర్బేరియం కీపర్ వై. రవి కుమార్ ఘనంగా సన్మానించబడ్డారు. అలాగే కళాశాల ప్రవేశాల ప్రక్రియలో విశేష కృషి చేసిన హిందీ అధ్యాపకులు డాక్టర్ ఎస్. రమణ ప్రత్యేక పురస్కారాన్ని అందుకున్నారు. కళాశాలలోని బోధనా, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాలుపంచుకున్న ఈ ఉత్సవం ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ విజయవంతంగా ముగిసింది.

### డాక్టర్ సర్వేపల్లిని నేటి ఉపాధ్యాయులు
# మార్గదర్శిగా తీసుకోవాలి : మోడరన్ అధినేత జివి రావు




**రామచంద్రపురం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని మోడ రన్ విద్యాసంస్థల ప్రాంగణంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి మోడ రన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జి.వి.రావు పూలదండ వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన ఉపాధ్యాయులు మనల్ని మనం కోసం ఆలోచించేలా చేస్తారని చెప్పిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటలు నేటితరం ఉపాధ్యాయులందరికీ ఆదర్శప్రాయం అని కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం తపించిన గొప్ప విద్యావేత్త సర్వేపల్లి అని రావు పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి స్ఫూర్తితో నేటి ఉపాధ్యాయులు బోధన చేయాలని రావు సూచించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్మాస్టర్ ముత్యాల చిట్టిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ద్రాక్షారామం సెయింట్ మేరీస్ చైతన్య హైస్కూల్‌లో
# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు




**ద్రాక్షారామ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం ద్రాక్షారామం అన్నాయి పేటలోని సెయింట్ మేరీస్ చైతన్య హై స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఫౌండర్ లంక కేరి చిట్టిబాబు, వారి సతీమణి మరియమ్మ, కరెస్పాండెంట్ లంక విజయ్ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, మరో అతిథిగా లంక సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, సమాజ అభివృద్ధికి మంచి విద్య అందించడం ద్వారా ఉపాధ్యాయులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం పాఠశాలలో సేవలందిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తమకు విద్యాబుద్ధులు నేర్పుతున్న ఉపాధ్యాయులకు విద్యార్థులు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. హైస్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ హెచ్.ఎం.లు సుజాత కుమారి, భారతి, పాఠశాల ఏ.ఓ. పలివెల శ్యామ్ బాబుతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయుల సేవలను స్మరించుకుంటూ, వారిని ఘనంగా సన్మానించిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య ముగిశాయి.

# కోటప్పకొండకు పంచముఖ దక్షిణామూర్తి విగ్రహం

### రాగి, వెండి, బంగారంతో అద్భుత రూపకల్పన



**మండపేట టౌన్, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** పల్నాడు జిల్లా కోటప్పకొండ శ్రీ త్రికూటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రతిష్టించేందుకు పంచముఖ దక్షిణామూర్తి విగ్రహం అద్భుతంగా రూపుదిద్దుకుంది. రాగి, వెండి, బంగారంతో పట్టణానికి చెందిన ప్రముఖ శిల్పి, శ్రీ రామకృష్ణ బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్ అధినేత వాసా శ్రీనివాస్ అత్యంత కళాత్మకంగా ఈ విగ్రహాన్ని రూపొందించారు. కోటప్పకొండకు చెందిన స్వామి భక్తుడు పూర్ణచంద్రరావు దంపతులు ఈ విగ్రహాన్ని తయారు చేయించారని శ్రీనివాస్ తెలిపారు. తొలుత రాగితో విగ్రహాన్ని తయారు చేసి, అనంతరం వెండి తాపడం, చివరగా బంగారు తాపడం చేసినట్లు చెప్పారు. తుది మెరుగులు దిద్దిన అనంతరం శనివారం దాత పూర్ణచంద్రరావు ప్రత్యేక వాహనంలో విగ్రహాన్ని కోటప్పకొండకు తరలించినట్లు తెలిపారు. విగ్రహం తయారీకి సుమారు 40 రోజుల సమయం పట్టిందన్నారు.





ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా

# ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

## జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపు నిచ్చారు. శనివారం కాకినాడ జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జేఎన్టీయూ అలుమ్ని ఆడిటోరియంలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకలకు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జేఎన్టీయూ ఉపకులపతి ఆచార్య సిఎస్ఆర్కె. ప్రసాద్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పరుపుల సత్యప్రభ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యా రంగంలో విశేష సేవలందించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల అంకితభావం వల్లే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని కొనియాడారు. విద్యారంగ పునరుద్ధరణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, గతంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉన్న పూర్వ వైభవాన్ని తిరిగి తీసుకొచ్చేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే విద్యార్థుల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని భరోసానిస్తూ, అవార్డు గ్రహీతలందరికీ అభినందనలు తెలియజేశారు.

**యువత ఎదుగుదలకు, దేశ పురోగతికి నాణ్యమైన విద్యే కీలకం : ఆచార్యులు సిఎస్ఆర్కె. ప్రసాద్**

కాకినాడ జేఎన్టీయూ వీసీ ఆచార్యులు సిఎస్ఆర్కె. ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ప్రపంచంలోనే అత్యంత గౌరవప్రదమైనదని, సమాజాన్ని ఉత్తమ మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న సర్వేపల్లి రాధాకృష్ణన్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురు పూజోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషకరమని ఆయన తెలిపారు. అయితే, కేవలం అక్షరాస్యత సాధించడంలోనే కాకుండా, ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల శాతాన్ని పెంచడంలో మనం మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ఉపాధ్యాయులే దేశ భవిష్యత్తుకు అసలైన శిల్పాలు : కర్రి పద్మశ్రీ**

ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యార్థులను కేవలం డిగ్రీ హోల్డర్లుగా కాకుండా, సమాజానికి ఉపయోగపడే నైపుణ్యాలు గల బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని కొనియాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ల కృషితో విద్యా రంగంలో వస్తున్న సానుకూల మార్పులను, జేఎన్టీయూలో సీట్ల పెంపు వంటి విజయాలను ఆమె ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**భవిష్యత్ తరాల పునాదుల కోసం ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలి : ఎమ్మెల్యే వనమాడి**

కాకినాడ పట్టణ శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను 1999లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, అప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి, విద్యాశాఖను నాలెడ్జ్ హబ్‌గా మార్చడానికి ఒక గొప్ప విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేశారని చెప్పారు.కానీ మధ్యలో అధికారం లోకి వచ్చిన వేరొక ప్రభుత్వం ఆ విజన్‌ను పక్కన పెట్టడం వల్ల రాష్ట్ర అభివృద్ధి వెనుకబడిపోయిందని ఆయన తెలిపారు.

**దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే గురువులను పూజించడం మన అందరి అదృష్టం : ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ**

మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఈ వేడుకను జరుపుకోవడం ఎంతో సంతోషకరమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవితాలపై అత్యంత ప్రభావం చూపించేది గురువేనని, వారి ప్రతిభను వెలికితీస్తూ భవిష్యత్తును తీర్చిదిద్దే గొప్ప బాధ్యతను ఉపాధ్యాయులు నిర్వర్తిస్తున్నారని ఆమె కొనియాడారు. ఎంతటి టెక్నాలజీ లేదా కృత్రిమ మేధస్సులు (ఏఐ) అభివృద్ధి చెందుతున్నా, విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణ నేర్పించడంలో ఉపాధ్యాయుల పాత్రను ఏదీ భర్తీ చేయలేదన్నారు.

**గురువులను గౌరవించడం మనందరి బాధ్యత డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి**

డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో గురుపూజోత్సవ వేడుకల సందర్భంగా అవార్డు గ్రహీతలైన సుమారు 84 మంది గురువులందరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ అవార్డులకు డీఈఓ గారు ఎటువంటి సిఫార్సులు లేకుండా పారదర్శకంగా బెస్ట్ టీచర్లను ఎంపిక చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యులు పవన్ కళ్యాణ్ తరపున ఉపాధ్యాయులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, గత ప్రభుత్వాలు ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల కౌంటర్ల వద్ద డ్యూటీలలో ఉంచిన విషయాన్ని గుర్తుచేశారు.

**ఉపాధ్యాయుల మార్గదర్శకత్వమే నా విజయానికి ఆధారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని అందరికీ శుభాకాంక్షలు తెలుపుతూ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ ప్రియ తన చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అమ్మనాన్నలు జన్మనిస్తే, ఉపాధ్యాయులు జీవితానికి సరైన మార్గదర్శకత్వం ఇస్తారని ఆమె పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివి డీఈవో పి.రమేష్ అన్నారు.గురుపూజోత్సవ వేడుకల్లో జిల్లా విద్యాధికారి పి.రమేష్ మాట్లాడుతూ.. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని జిల్లాలోని సుమారు 6 వేల మంది ఉపాధ్యాయులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఘనంగా సన్మానించడం జరిగిందన్నారు. జిల్లాలో గత పదో తరగతి పరీక్షల్లో 86 శాతం ఉత్తీర్ణత సాధించామని, రాబోయే సంవత్సరంలో 100 శాతం సాధించడమే లక్ష్యంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన జిల్లా ఉపాధ్యాయుల కు ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటర్నేషనల్ ఎడ్యుకేషనల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 29 మంది ఉపాధ్యాయులను ఫిన్లాండ్‌లో జరిగిన ఎక్స్పోజర్ విజిట్ ఇంటర్నేషనల్ కార్యక్రమానికి కాకినాడ జిల్లా నుంచి పాల్గొన్న ఇద్దరు ఉపాధ్యాయులు తొండంగి మండలం కే.పి.పురం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్) పి.ప్రవీణ్ కుమార్, యు.కొత్తపల్లి మండలం కొమరగిరి జెడ్పీహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్(గణితం) పి.రవి శంకర్ లను గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఇతర ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎపీడీ వీవీవీ.సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్, డిప్యూటీ డీఈవో లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు : కలెక్టర్



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల మంజూరు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ మూడో దఫా సమావేశం కమిటీ అధ్యక్షులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగాప్రతిపాదించిన దరఖాస్తుల పై కమిటీ చైర్మన్ కమిటీ సభ్యులతో కలిసి క్షుణ్ణంగా..నియమ నిబంధనల మేరకు పరిశీలించి సూచనలు సలహాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు నియమ నిబంధనల మేరకు అక్రిడిటేషన్ లు మంజూరు చేయడంజరుగుతుందన్నారు.ఇది నిరంతర ప్రక్రియ అని.. అర్హులైన జర్నలిస్టులు ఇంకనూ ఉన్ననూ తదుపరి సమావేశంలో చర్చించి నిర్ణయించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి డాక్టర్ డి తిప్పేనాయక్, ఐ డపి ఆర్ డి డి మరియు కన్వీనర్ బి.పద్మజ,నగర పాలక సంస్థ కమిషనర్ /గృహ నిర్మాణ సంస్థ పిడి,ఎన్.వి సత్యనారాయణ,జిల్లా ప్రధాన రవాణా అధికారి కే రమేష్,కమిటీ సభ్యులు నవీన్ రాజ్, ముమ్మిడి లక్ష్మణ్,శోభన్ బాబు, కామేశ్వర రావు, త్రిమూర్తులు,శ్రీనివా సరావు పల్లంరాజు, సాయినాథ్, దురానీ,శివ నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా

# నేటి బ్రహ్మాస్త్రం ఎడిటర్ ప్రకాష్‌కు ఘన సన్మానం



**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** గురుపూజోత్సవం సందర్భంగా పత్రికా రంగంలో గత 40 సంవత్సరాల నుండి తనదైన ముద్రను వేసుకున్న కాకినాడ రూరల్ మీడియా హౌస్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్న నేటి బ్రహ్మాస్త్రం జర్నలిస్ట్ ప్రకాష్ రావును శనివారం నాడు పలు అభివృద్ధి రోడ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మరియు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దుస్సాలువతో మరియు పూల మొక్కను సమర్పించి సన్మానించారు. ఈయన పత్రికా రంగంలో తనదైన ముద్ర వేసుకున్నారని ఆయన తెలియజేశారు. సన్మాన గ్రహీత నేటి బ్రహ్మాస్త్రం ప్రకాష్ రావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా అనేక జాతీయ పత్రికలలో నేను పని చేసి ఉన్నాను అయితే ఇంతవరకు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లడమే నా ధ్యేయంగా పనిచేశానని క్రమశిక్షణతో ఒకే మాట కట్టుబాటుతో నా యొక్క వృత్తిని నిర్వహించానని దాని నిమిత్తమే ఈరోజు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే చేతుల మీదుగా నా మిత్రులు జర్నలిస్టుల సమక్షంలో ఈ గౌరవ సత్కారం లభించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

# కోటనందూరు మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా వీరే



**కోటనందూరు, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరు మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఈ క్రింది వారు ఎంపికయ్యారు. భీమవరం కోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఎస్ చంద్రశేఖర్, కోటనందూరు ఎంపీపీ స్కూల్లో పనిచేస్తున్న కేవివి సత్యనారాయణ, జగన్నాధపురం ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న పి శ్రీలక్ష్మి, పాత కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఎల్ శ్రీనివాసరావు, పాత కొట్టాం ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న ఎన్ ఉషా లక్ష్మి, కే ఈ చిన్నయ్యపాలెం ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న టీ రత్నకుమారి ఎంపికయ్యారు. వీరిని సహసర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు అభినందించారు.

# శ్రీకృష్ణ ఆలయంలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**కోటనందూరు, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా కోటనందూరులో శ్రీకృష్ణ ఆలయంలో ఘనముగా కృష్ణాష్టమి వేడుకలు జరిగినవి. స్థానిక రాజులు వీధిలో శ్రీకృష్ణుని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దంతులూరి చిరంజీవి రాజు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి పర్వదినము ఆధ్యాత్మిక చైతన్యంతో ఆనందాన్ని పంచుతుందనీ, శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీత సర్వ మానవాళికి ఎంతో ఉపయోగకరంగా ఉందని, స్వామి ఆశీస్సులు అందరిపైనా ఉండాలని తెలియజేశారు. సాయంత్రం ఉట్టుకొట్టే కార్యక్రమం నిర్వహించగా యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు. ఉట్టి కొట్టిన యువకులకు ప్రత్యేక బహుమతులు పంచాద అర్జున్ రావు మాష్టారు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంపనబోయిన శివన్నారాయణ, చందక శ్రీను, అంకారెడ్డి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చేతుల మీదుగా సిసి రోడ్లు, డ్రైనేజీలు ప్రారంభోత్సవం






**కాకినాడ రూరల్, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ చేతుల మీదుగా వాకలపూడి గ్రామంలో 8 కోట్ల59 లక్షలు మరియు వలస పాకల గ్రామంలో 2 కోట్ల11లక్షలుతో చేపట్టినటువంటి సిమెంట్ రోడ్లను డ్రైనేజీలను కూటమి నాయకుల సమక్షంలో ఘనంగా ప్రారంభోత్సవం చేశారు.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ కాకినాడ రూరల్ లో ముఖ్యమంత్రి,ఉప ముఖ్యమంత్రి ఆశీస్సులతో, సహకారాలతో చాలా అభివృద్ధి పనులను చేపట్టమని, అలాగే ఈ రెండు గ్రామాలలో సీసీ రోడ్లను డ్రైనేజీలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు.. అలాగే అంగన్వాడి సెంటర్ వద్ద గురుపూజోత్సవం సందర్భంగా పిల్లలతో కొంచెం సేపు ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణ,నులుకుర్తి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ బాబా, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగ గంగయ్య, రంబాల వెంకటేశ్వరరావు, పాండ్రంకి రాజు, బన్ను, బోలా కృష్ణమోహన్, ముసలయ్య, సీతయ్య దొర, సలాది శ్రీనివాస్, మాత లక్ష్మణ్, అధికారులు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం







**కోటనందూరు, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా కాకినాడ జిల్లా కోటనందూరు మండలంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కే వీరభద్రరావు, పాత కొట్టాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కే ఎన్ వి సింగరాజు, ఎస్ఆర్ పేట ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న ఎస్ జి టి పొలమరశెట్టి ఇందూ దేవి, టి జే నగరం ఎంపీపీ స్కూల్ లో పనిచేస్తున్న ఎస్జీటీ షేక్ తాజుద్దీన్ బాబా, అల్లిపూడి కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంలో పనిచేస్తున్న ఇంగ్లీష్ టీచర్ సుర్ల సుమ ఎంపిక అయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా కాకినాడలో జేఎన్టీయూ అల్యూమిని ఆడిటోరియంలో జరిగిన గురుపూజోత్సవం వేడుకలలో కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో వీరికి అవార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వనమాడి కొండబాబు, ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, డీఈఓ రమేష్, డిప్యూటీ ఈవో శర్మ అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు ఆటపాట్ల ద్వారా విద్యా బోధన అలాగే ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమాలు, విద్యారంగానికి తమదైన శైలిలో విశేష సేవలు చేసిన ఉపాధ్యాయులకు ఈ అవార్డులు రావడం పట్ల మండల ప్రజా ప్రతినిధులు, సహసర ఉపాధ్యాయులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు అభినందనలు తెలియజేశారు.

కోటనందూరు హైస్కూల్లో

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



**కోటనందూరు, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా, కోటనందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు స్కూల్ కమిటీ చైర్మన్ చందక శ్రీను ఆధ్వర్యంలో ఘనముగా జరిగినవి.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని జరిగిన ఈ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కె ఎస్ వి సత్యనారాయణ (శ్రీను) ను చైర్మన్ చందక శ్రీను సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శ్రీను మాట్లాడుతూ మన జీవితంలో ఉన్నత స్థానము గురువుకి ఇస్తామని, మనల్ని జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఒక గురువు కృషి వెలకట్టలేనిదని అటువంటి గొప్ప వ్యక్తులను స్మరించుకుంటూ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు జరుపుకోవడం, నన్ను సత్కరించడం చాలా ఆనందంగా ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు.

# జిల్లా కలెక్టర్‌కు రాష్ట్రస్థాయి రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అవార్డు

**కలెక్టర్‌ను శుభాకాంక్షలు తెలియజేసిన జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు**



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ అందుకున్న జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ను శనివారం కాకినాడ కలెక్టరేట్ లో జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు ప్రత్యేకంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. సెప్టెంబర్ 1న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన భారతీయ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాఖ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రతిష్టాత్మకమైన గోల్డ్ మెడల్ అవార్డును అందుకున్న సందర్భంగా జిల్లా రెవిన్యూ అధికారి డా డి. తిప్పే నాయక్, కాకినాడ కమిషనర్ ఎన్వీవీ సత్యనారాయణ ఇతర అధికారులు జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌ను శాలువాతో ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంటలు ఎం.జగన్నాథం, శాస్త్రి, రాజు, దుర్గా ప్రసాద్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహణ

**ఉత్సాహంగా పాల్గొన్న వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది**

**రక్తదాన శిబిరాన్ని సందర్శించిన జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ - 37 యూనిట్ల రక్తం సేకరణ.**



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం కాకినాడ కలెక్టరేట్ ప్రాంగణంలో ప్రత్యేక రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులైన చిన్నారులకు అండగా నిలవాలనే ప్రధాన సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా రెవెన్యూ అధికారి డా. డి. తిప్పేనాయక్ పర్యవేక్షించారు. ఈ శిబిరంలో సీపీవో పి. త్రీనాథ్, కాకినాడ అర్బన్ తహశీల్దార్ వి. జితేంద్ర, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మొత్తం 37 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. తలసేమియా బాధితులైన చిన్నారుల ప్రాణాలను కాపాడటానికి రక్తాన్ని అందించడమే ఈ శిబిర ప్రధాన ఉద్దేశమన్నారు. రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి ఒక్క రక్తదాతకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా మహిళలు కూడా రక్తదానానికి ముందుకు రావడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులోనూ ఇలాంటి సేవ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని రెడ్ క్రాస్ కార్యదర్శిని కె.శివకుమార్ ను జేసీ కోరారు. రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన రక్తదాతలకు డీఆర్వో డా. డి.తిప్పేనాయక్, రెడ్ క్రాస్ సంస్థ కార్యదర్శి కే శివకుమార్ తో కలిసి సర్టిఫికెట్లు అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వెంకట లక్ష్మి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఎం.జగన్నాధం, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్. చలమయ్య, రెడ్ క్రాస్ సిబ్బంది, కలెక్టరేట్ ఇతర విభాగాల సిబ్బంది రెడ్ క్రాస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు సకాలంలో పరిష్కరిస్తాం

**ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్ ఎ.గణేష్**



**కాకినాడ,సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా ట్రెజరీ కార్యాలయం నందు డిప్యూటీ డైరెక్టర్ ఎ. గణేష్ అధ్యక్షతన పెన్షనర్స్ సంఘాల సంయుక్త సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ గణేష్ మాట్లాడుతూ ట్రెజరీ కార్యాలయం నుండి పెన్షన్లు పొందుతున్న పెన్షనర్ల మరియు ఫ్యామిలీ పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన వివిధ రకాల ఉత్తరువులపై సందేహాలను నివృత్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ తాలూకు మెడికల్ రీయంబర్స్మెంట్ బిల్లులుట్రెజరీ ద్వారా అమలు చేయడానికి తగిన మార్గదర్శకాలు విడుదల అయిన తరువాత మెడికల్ రీ ఎంబుర్స్మెంట్ బిల్లులు ప్రాసెస్ చేయడం జరుగుతుంది.ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా ట్రెజరీ సహాయ ట్రెజరీ అధికారులు డి అపర్ణ, ఐ.రమేష్,రోషన్ పాషా,ట్రెజరీ ఉద్యోగుల నాయకులు భాస్కర్ అధ్యక్షులు శశి కుమార్ మరియు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పెన్షనర్స్ సంఘాల నాయకులు కే సత్తిరాజు, యు. ఎస్. ఎన్.సత్యనారాయణ, కెవి రమణ,పూర్వపు జె ఎ సి చైర్మన్ ఆచంట రామారాయుడు, పి. మాధవరావు,టి.సత్యనారాయణ, పద్మనాభం, ఎంవి వీరభద్ర స్వామి, చింతపల్లి సుబ్బారావు, డి సదానందమూర్తి, వెంకట్రావు బాలయ్య, ఎస్. ఏం. రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో

# డబుల్ గోల్డ్ మెడల్స్ సాధించిన హెడ్ కానిస్టేబుల్



**కాకినాడ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బ్యాడ్మింటన్ విభాగంలో కాకినాడ జిల్లా త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ మల్లాడి వెంకట రమణ డబుల్ గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈనెల 1వ తేదీ నుంచి నాలుగో తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అమరావతిలోని మంగళగిరిలో జరిగాయి. ఈ పోలీస్ మీట్ లో కాకినాడ 3 టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మల్లాడి వెంకట రమణ(2622) షటిల్ బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో 50 ప్లస్ డబుల్ గోల్డ్ మెడల్, 55 ప్లస్ పురుషుల విభాగంలో బంగారు పతకాలు సాధించారు. రమణ కృష్ణాజిల్లా మచిలీపట్నం కంట్రోల్ రూమ్ హెడ్ కానిస్టేబుల్ (1224) చలమల శెట్టి రామ్మోహన్ తో కలిసి డబుల్స్ విభాగంలో ఈ డబుల్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ టోర్నీలో రమణ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు ఎపి పోలీస్ డిజి హరీష్ కుమార్ గుప్తా చేతులమీదుగా బంగారు పతకాలను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలు రమణ, రామ్మోహన్ ను పోలీస్ ఉన్నత అధికారులు పోలీస్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.






**గోకవరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం గ్రామ పరిధిలో గోవుల వధ జరుగుతోందన్న ఆరోపణలపై గ్రామస్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కబేళాల్లో గోవులను అమానుషంగా వధిస్తున్నారని, ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తక్షణమే దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. గోవును హిందువులు గోమాతగా పూజిస్తారని, అనేక కుటుంబాలు పశువులను జీవనాధారంగా భావిస్తాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అలాంటి మూగజీవులను కళ్లముందే వధిస్తుంటే వాటి బాధను పట్టించుకునే వారు లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోవుల వధకు సంబంధించి ప్రభుత్వం, అధికారులు నిర్దేశించిన నిబంధనలు ఉన్నప్పటికీ గోకవరం పరిధిలో అవి అమలవుతున్నాయా లేదా అన్నదానిపై అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. అనుమతులు లేకుండా కబేళాలు నిర్వహిస్తున్నట్లయితే వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. శుభకార్యాల్లో గోపూజకు ప్రాధాన్యత ఇస్తూ గోవులను పవిత్రంగా భావించే సంప్రదాయం ఉందని, అలాంటి గోవులను అక్రమంగా వధిస్తున్నారన్న ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోందని గ్రామస్తులు తెలిపారు.

### అధికారులు స్పందించాలి

గోకవరంలో గోవుల వధకు సంబంధించిన ఫిర్యాదులపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు. అక్రమంగా కబేళాలు నిర్వహిస్తున్నట్లు తేలితే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, చట్టబద్ధంగా ఉన్న కార్యకలాపాలపై కూడా నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గోవుల అక్రమ రవాణా, వధను అరికట్టి మూగజీవుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

# కోరుకొండ సరస్వతి విద్యానికేతన్‌లో ఘనంగా గురుపూజోత్సవం






**కోరుకొండ, సెప్టెంబర్ 5, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రులు జన్మనిస్తే మనకు విద్యాబుద్ధులు చెప్పి మన జీవితాన్ని మహత్తర గమ్యాన్ని చేర్చేది విద్య అని అటువంటి విద్య నేర్పిన గురువులను మనం సత్కరించుకోవడం మన పూర్వజన్మకృతమని కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ అధినేత పెనకటి గంగాధర్ అన్నారు.శనివారం కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో అధినేత పెనకటి గంగాధర్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలన్న ఉద్దేశంతో కోరుకొండలో సరస్వతి విద్యానికేతన్ స్థాపించి, అన్ని వర్గాల పిల్లలకు వ్యాపార ధోరణితో కాకుండా ఇంగ్లీష్ తో పాటు వివిధ కాంపిటేటివ్ పరీక్షల్లో తనదైన ముద్ర వేసుకొని ఐఐటి, ట్రిబుల్ ఐటీ లో మంచి ర్యాంకు సాధించి న తమ విద్యార్థులు నేడు పలు ఉన్నత స్థానాల్లో ఉన్నారని కొనియాడారు. ఉపాధ్యాయులుగా విశిష్ట సేవలు అందించడంతో పాటు నేటికీ సమాజ సేవకోసం అహర్నిశలు శ్రమిస్తున్న రిటైర్డ్ ఉపాధ్యాయులు జీవి రవీంద్ర, సింగారపు వెంకటేశ్వరరావు, పెద్దింటి రంగా ప్రసాద్, పెనకటి శివాజీ తదితరులకు పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. అనంతరం కోరుకొండ రాజమహేంద్రవరం, రంప ఎర్రంపాలెం గ్రామాల్లో వేతనాలతో ప్రమేయం లేకుండా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నా ఉపాధ్యాయ సిబ్బందిని పూలమాలలు వేసి సాల్వో ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యాప్రదాత, కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ ను ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు గజమాలు వేసి సాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సంస్కృతి క్లబ్ అధ్యక్షులు నాళం శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ భరత్, మురళి నాయుడు, నరేష్, షణ్ముఖ, జూనియర్ కళాశాల సిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కల్లూరి మాణిక్యం జడ్పీ హెచ్ స్కూల్లో

# ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

**సీతానగరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం లోని పురుషోత్త పట్నం జెడ్పీ హెచ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్కేజీ చదువుతున్న చిన్నారి పసలపూడి సహన (ఖుషి)తన క్లాసు టీచర్ పట్ల తన గౌరవాన్ని గులాబీ చెట్టు ఇవ్వడం ద్వారా శుభాకాంక్షలు తెలియజేసింది. ఈ చిన్నారి చేసిన పనికి స్కూలు సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# పీ4 కార్యాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే బత్తుల

**కోరుకొండ, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** రాజానగరంలో పీ4 కార్యాలయాన్ని శనివారం రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సందర్శించారు. శనివారం పీ4 కార్యాలయం సందర్శించిన అనంతరం ఎంపీడీవో జేఏ ఝాన్సీ, మండల ప్రత్యేక అధికారులతో నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో చేపట్టబోయే వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలో నిలిచిపోయిన పనులను వేగవంతం చేయడం, రాబోయే కొత్త ప్రాజెక్టులకు ప్రణాళికలు సిద్ధం చేయడంపై అధికారులతో అన్నారు. పీ4 కార్యాలయాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఝాన్సీ, మండల ప్రత్యేక అధికారులు, పీ4 ప్రాజెక్టు ప్రతినిధులు, ఎన్డీఏ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీవో, ప్రత్యేక అధికారులతో భేటీ



ప్రధాన రహదారిపై

# ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు : ఎస్సై శివాజీ

**దుకాణాల ముందు వాహనాలు పెడితే యజమానులది బాధ్యత**



**కోరుకొండ, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ ప్రధాన జాతీయ రహదారి 516(బి)పై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కోరుకొండ ఎస్సై ఆర్ శివాజీ అన్నారు. శనివారం ఆయన తన సిబ్బందితో కలిసి ప్రధానం రహదారులపై ఉన్న వ్యాపారస్తులతో మాట్లాడుతూ తమ దుకాణాల ముందు వాహనాలను అడ్డదిడ్డంగా పెట్టకుండా చూడవలసిన బాధ్యత షాప్ యజమానిదేనని, షాపు ముందు వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం కలిగితే షాప్ యజమానులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపిస్తామన్నారు. కోరుకొండ ప్రధాన రహదారులపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఇరువైపులా ఉన్న షాప్ యజమానితో మాట్లాడి ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్నామని, నిర్లక్ష్యం చేస్తే షాప్ యజమాని పై కేసులు తప్పవని హెచ్చరించారు. వాహనదాలకు సక్రమమైన రికార్డులు, త్రిబుల్ రైడింగ్, రేష్ డ్రైవింగ్ చేసే, కేసులు నమోదు చేసి, అధిక పెనాల్టీలు తప్పవన్నారు. ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బంది కలగకుండా వ్యాపారస్తులు, ప్రజలు సహకరించాలని కోరారు.

# పురుషోత్తపట్నం రైతులకు న్యాయం : ఫలించిన ఎమ్మెల్యే బత్తుల కృషి

**పురుషోత్తపట్నం భూ నిర్వాసితులకు ఊరట**

**నష్టపరిహారం చెల్లింపునకు రూ. 32.10 కోట్లు మంజూరు**



**సీతానగరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం వల్ల భూములు కోల్పోయిన రైతులకు, నిరుపేద నిర్వాసితులకు రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అవిరళ కృషి ఫలితంగా ఎట్టకేలకు న్యాయం చేకూరింది. నష్టపరి హారం తో పాటు చట్టబద్ధమైన వడ్డీ బకా యిలను రైతులకు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ. 32,10,20,150/- లను విడుదల చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.ఈ ప్రాంత రైతుల కష్టాలను, భూ నిర్వాసితులు ఎదుర్కొంటున్న సుదీర్ఘ నిరీక్షణను తన స్వంత సమస్యగా భావించిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నిరంతరం శ్రమించారు. నిర్వాసితుల ఆవే దనను ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు,ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్,రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి వేదికపైనా రైతుల తరఫున గళం విప్పడంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కీలక పాత్ర పోషించారు. రైతుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, స్వయంగా పర్యవేక్షించి, ఈ భారీ పరిహార నిధులు మంజూ రయ్యేలా చేసి తన పట్టుదలను నిరూపించుకున్నారు.రైతుల సంక్షే మానికి పెద్దపీట వేస్తూ, నిధులను మంజూరు చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర నీటి పారుదల శాఖ నిమ్మల రామానాయుడుకు మరియు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి కి నియోజకవర్గ రైతాంగం, భూ నిర్వాసితులు తర పున హృదయపూర్వక ధన్య వాదా లు తెలియజేస్తున్నానన్నారు.

ప్రజల నిర్లక్ష్యంతో పెరుగుతున్న

# ప్రమాదాల ముప్పు - జాగ్రత్తలు తప్పనిసరి



**సీతానగరం, సెప్టెంబర్ 5, విశ్వం వాయస్ న్యూస్ :** సీతానగరం మండల పరిధిలోని పలు గ్రామా ల్లో రహదారులపై ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామా గ్రిని నిల్వ చేయడం, రోడ్లపైనే శుభకార్యాలు, ఫంక్షన్లు నిర్వహిస్తూ టెంట్లు ఏర్పాటు చేయడం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రహదారులపై అడ్డంకులు ఏర్పడటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందో ళన వ్యక్తం చేస్తు న్నారు.ఇళ్ల నిర్మాణ పనుల కోసం తీసు కువచ్చిన ఇసుక, కంకర తదితర సామగ్రిని కొందరు రహదారులపైనే గుట్టలుగా పోస్తున్నారు. మరికొందరు శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల కోసం రోడ్లపై టెంట్లు ఏర్పాటు చేసి రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ అడ్డంకులు వాహనదారులకు స్పష్టంగా కనిపించకపోవడంతో ప్రమా దాల ముప్పు మరింత పెరు గుతోంది.గతంలో రహదారు లపై ఇలాంటి అడ్డంకుల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకున్న సందర్భా లు ఉన్నాయని, సంబంధిత బాధ్యులపై కేసులు కూడా నమోదు చేసిన సందర్భాలు ఉన్నాయని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఒకరి నిర్లక్ష్యం కారణంగా ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడ కుండా ప్రతి ఒక్కరూ బాధ్య తగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.రహదారులపై ఇసుక, కంకర, నిర్మాణ సామగ్రి లేదా ఇతర వస్తువులను గుట్టలుగా వేయవద్దని ప్రజలకు సూచిస్తున్నారు. అలాగే రహదారులపై ఫంక్షన్లు, శుభకార్యాలు నిర్వహించాల్సి వస్తే రహదారులకు అంత రాయం కలగకుండా ప్రత్యామ్నాయ ప్రదేశాలను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.రోడ్లు అందరి కోసం ఉన్నాయని, ఒక్కరి నిర్లక్ష్యం వల్ల అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు గుర్తించాలని, రహదారి భద్రతకు ప్రతి ఒక్కరూ సహకరించి, ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిం చాలని అధికారులు కోరుతున్నారు.



నిన్ను ఎవరు గుర్తుపడతారు.. కనీసం గూగుల్ కూడా

# నీ పేరు రాదని అవమానించారు : వైష్ణవి చైతన్య



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ సోదరుడిగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు ఆనంద్ దేవరకొండ. అయితే దొరసాని, మిడిల్ క్లాస్ మెలొడీస్, పుష్పక విమానం, హైవే, బేబీ.. ఇలా డిఫరెంట్ సినిమాలతో తనకంటూ ఓ ఐడెంటిటీని సొంతం చేసుకున్నాడు. ముఖ్యంగా సినిమా కథల ఎంపికలో ఆనంద్ దేవరకొండ చాలా డిఫరెంట్‌గా ఆలోచిస్తున్నాడు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న 'ఎపిక్ ఫస్ట్ సెమిస్టర్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఎపిక్ ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో, నటి వైష్ణవి చైతన్య మాట్లాడుతూ వేదికపై ఉన్న అతిథులకు, మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన రష్మిక, శివ నిర్వాణ, శైలేష్, సాయి మార్తాన్, కళ్యాణ్, వినోద్ వంటి ప్రముఖులకు ఆమె పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు. దర్శకుడు శివ నిర్వాణను అభినందిస్తూ, ఆయన రూపొందించిన ఇరుముడి చిత్ర విజయానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. నేను మా కుటుంబంతో కలిసి సినిమాను థియేటర్లో చూశాను. ముఖ్యంగా మా అమ్మమ్మ చాలా ఎమోషనల్ అయ్యారు, సినిమా బాగా నచ్చింది. ప్రతిరోజూ మా ఇంట్లో ఇరుముడి పాటలు వినిపిస్తూనే ఉంటాయి, అని వైష్ణవి పేర్కొన్నారు. యాల యాల పాట చాలా బాగుందని, దానిని లూప్‌లో వింటున్నానని హిషాంను అభినందించారు. సితార బ్యానర్‌లో నేను సినిమాలు చేస్తూనే వస్తున్నాను. ఇప్పుడు ఈ బ్యానర్‌లో 'ఎపిక్'ని చేయడం ఆనందంగా ఉంది. మున్ముందు మరిన్ని మంచి చిత్రాల్ని చేయాలని కోరుకుంటున్నాను. ఆదిత్య గారు నా ఫేవరేట్ డైరెక్టర్, ఫ్రెండ్. కడలి పాత్రలో నన్ను చూసి, నాకు అవకాశాన్ని ఇచ్చినందుకు ఆదిత్య గారికి థాంక్స్. అజీమ్ గారు మా అందరినీ అద్భుతంగా చూపించారు. ప్రతీ ఫ్రేమ్‌ని అందంగా మలిచారు. హేషమ్ గారు మాకు మంచి మ్యూజిక్ ఇచ్చారు. 'బేబి' నుంచి ఆనంద్‌తో పరిచయం ఏర్పడింది. అప్పుడూ, ఇప్పుడూ ఆనంద్ ఒకేలా ఉన్నాడు. ఆనంద్‌లో ఎప్పుడూ ఒకేలా ఉండటం అనే ఆ లక్షణమే నాకు ఇష్టం. పక్కన వారు ఎదుగుతుంటే ఆనంద్ ఎక్కువగా సంతోషిస్తాడు. నాకు కళ్యాణ్ శంకర్ గారు ఈ సినిమాతో మంచి ఆర్టిస్ట్‌గా బిజీ అవుతారు. 'ఎపిక్' చిత్రం మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. అలాగే వైష్ణవి తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న రిజెక్షన్స్, అవమానాలను గుర్తు చేసుకుంటూ ఎమోషనల్ అయ్యింది వైష్ణవి. సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టే ప్రయత్నాల్లో ఉన్నప్పుడు ఒకరు నన్ను చాలా చులకనగా చూశారు. 'అసలు నీకంటూ ఏం గుర్తింపు ఉంది.? నిన్ను ఎవరైనా గుర్తిస్తారా? గూగుల్‌లో నీ పేరు కొడితే కనీసం నీ పేరైన వస్తుందా?' అని ముఖం మీదే ఎగతాళి చేశారు. ఆ సమయంలో నా దగ్గర ఎలాంటి విజయాలూ లేకపోవడంతో ఆ మాటలు నన్ను ఎంతగానో గాయపరిచాయి. ఆ బాధను మౌనంగా భరించడం తప్ప ఏమీ చేయలేకపోయాను" అంటూ వైష్ణవి చెప్పుకొచ్చారు.

నా గురించి పిచ్చిపిచ్చిగా మాట్లాడారు..

# సుమలత బహిరంగ క్షమాపణలు చెప్పాలి : శేఖర్ మాస్టర్



ఫిలిం ఫెడరేషన్, డ్యాన్సర్స్ అసోసియేషన్ మధ్య వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఇటీవలే రఘు మాస్టర్‌ను టెంపరరీ ప్రెసిడెంట్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. ఆతర్వాత సుమలత కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే యూనియన్ ఆధిపత్యం, అధికారిక గుర్తింపు, బ్యాంకు లావాదేవీలు, నిధుల నిర్వహణ వంటి అంశాలపై రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. సుమలత బహిరంగ క్షమాపణలు చెప్పాలని శేఖర్ మాస్టర్ అన్నారు. జానీ మాస్టర్ సతీమణి సుమలత పై ఫెడరేషన్ కు అలాగే డాన్సర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రఘు మాస్టర్ కి కంప్లైంట్ చేశారు శేఖర్ మాస్టర్. అలాగే సుమలత, సీనియర్ డాన్సర్ లక్షి తన పై అనుచిత వ్యాఖ్యలు చేశారని శేఖర్ మాస్టర్ పిర్యాదు చేశారు. అనంతరం శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ.. సుమలత, సీనియర్ డాన్సర్ లక్షి చేసిన వ్యాఖ్యలు నన్ను ఎంతో బాధించాయని అన్నారు. అదేవిధంగా నా ప్రమేయం లేకుండా ఎలాంటి నిరూపితం ఆధారం లేకుండా నా మనోభావాలు దెబ్బతినేలా సుమలత అనుచిత వ్యాఖ్యలు చేశారు, నా పుట్టు పూర్వోత్తరాలు గురించి కూడా మాట్లాడారని శేఖర్ మాస్టర్ అన్నారు. కక్కితే కాళ్లమీద పడతాయి అని నాపై అభియోగాలు మోపి నిందలు వేసి చాలా వ్యంగ్యంగా ఎటకారంగా మాట్లాడారని శేఖర్ మాస్టర్ అన్నారు. ఈ గొడవలు వద్దు అని మీడియా ముందుకు రావద్దు అని పెద్దలు చెప్పారని వారి మీద గౌరవంతో ఉన్నాను, కానీ సుమలత ప్రవర్తించిన తీరు నాకు చాలా బాధాకరం అయ్యింది. నా యూనియన్ సభ్యులకోసం సహాయ సహకారంలో అందించడంలో ముందు ఉంటాను. యూనియన్ సభ్యులకు పర్సెంటేజ్ విషయంలో అన్యాయం జరుగుతుంటే ఎన్ని సాంగ్స్ ని వదులుకున్నా.. అనుచిత వ్యాఖ్యలుచేసిన సుమలత, సీనియర్ లక్ష్మి బహిరంగ క్షమాపణ చెప్పాలని శేఖర్ మాస్టర్ డిమాండ్ చేశారు. ఫిలిం ఫెడరేషన్, డ్యాన్సర్స్ అసోసియేషన్ మధ్య వివాదం రోజురోజుకు ముదురుతోంది. ఇటీవలే రఘు మాస్టర్‌ను టెంపరరీ ప్రెసిడెంట్‌గా సభ్యులు ఎన్నుకున్నారు. ఆతర్వాత సుమలత కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే యూనియన్ ఆధిపత్యం, అధికారిక గుర్తింపు, బ్యాంకు లావాదేవీలు, నిధుల నిర్వహణ వంటి అంశాలపై రెండు వర్గాల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో ఇరువర్గాలు పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ నేతృత్వంలోని వర్గానికి, సంఘం నాయకురాలు సుమలత ప్యానెల్‌కు మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు.

# 8 ఏళ్లుగా ఇండస్ట్రీని షేక్ చేస్తున్న సినిమా.. రూ.25 కోట్లు పెడితే రూ.180 కోట్లు వచ్చాయి..




ఇప్పుడు వస్తున్న సినిమాలు ఓటీటీలను కూడా దృష్టిలో పెట్టుకోని తెరకెక్కిస్తున్నారు దర్శక నిర్మాతలు. కొన్ని సినిమాలు థియేటర్స్ లో ఫ్లాప్ అయినా కూడా ఓటీటీల్లో విడుదలై సంచలన విజయాలను అందుకుంటున్నాయి. అలాగే కొన్ని సినిమాలు డైరెక్ట్ గా ఓటీటీల్లో రిలీజ్ అయ్యి మంచి విజయాలను అందుకుంటున్నాయి. కంటెంట్ ఆడియన్స్ కు కనెక్ట్ అయితే చాలు సినిమా బ్లాక్ బస్టర్ అవ్వడం ఖాయం.. చిన్న సినిమాలు కూడా భారీ హిట్స్ అందుకుంటున్నాయి. అలాగే కొన్ని సినిమాలు ఊహించని విధంగా రికార్డ్స్ క్రియేట్ చేస్తున్నాయి. తక్కువ బడ్జెట్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన సినిమాలు చాలా ఉన్నాయి. 2018 సంవత్సరంలో విడుదలైన ఒక సినిమా ఆడియన్స్ ను కట్టిపడేసింది. హారర్, కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా రికార్డ్ స్థాయిలో కలెక్షన్స్ సొంతం చేసుకుంది. ఆ సినిమా ఇప్పటికీ ట్రెండింగ్ లోనే దూసుకుపోతుంది. ఇంతకూ ఆ హారర్ సినిమా ఏదో తెలుసా.? ఆ సినిమా స్త్రీ. ఆ సినిమాలో రాజ్ కుమార్ రావు, శ్రద్దా కపూర్ లు ప్రధాన పాత్రలలో నటించారు. 2018లో విడుదలైన ఈ హర్రర్-కామెడీ చిత్రం ప్రజల హృదయాలను గెలుచుకుంది. ఈ సినిమా ప్రజలను భయపెట్టడమే కాకుండా కడుపుబ్బా నవ్వించింది. బాలీవుడ్ ఇండస్ట్రీలో స్త్రీ సినిమా భారీ కలెక్షన్స్ రాబట్టి నయా రికార్డ్ క్రియేట్ చేసింది. 'స్త్రీ' సినిమా కథ విషయానికొస్తే.. మధ్యప్రదేశ్‌లోని చందేరి ఆధారంగా రూపొందించారు. ఆ గ్రామంలో ఒక స్త్రీ ఆత్మగా మారి తిరుగుతుందని.. ఆమెను ప్రజలు 'స్త్రీ' అని పిలుస్తారు. ఆమె ఎవరిని ఇబ్బందిపెట్టకుండా ఉండేందుకు ప్రజలు తమ ఇళ్ల గోడలపై 'ఓ స్త్రీ రేపు రా' అని రాసుకుంటారు. రాత్రి సమయంలో ఆ ఆత్మ ఊర్లో తిరుగుతుంటుంది. అయితే అది కేవలం పురుషులను మాత్రమే లక్ష్యంగా చేసుకుంటుంది. ఆమె వారిని తీసుకెళ్లి బట్టలు లేకుండా ఓ జనావాసం లేని ఓ ప్రదేశంలో బంధిస్తుంది. అయితే ఆ ఆత్మను హీరో, హీరోయిన్ ఎలా బంధించారు. ఆ గ్రామ ప్రజలకు ఆత్మ నుంచి విముక్తి దొరికిందా లేదా అన్నది మనం సినిమాలోనే చూడాలి.

# 'ఆ నలుగురు' డైరెక్టర్ కొత్త సినిమా.. తెలుగు ఇండస్ట్రీలోనే అతిపెద్ద టైటిల్ ఇదే..



ఇప్పుడు సినిమా వేగంగా జనాల్లోకి వెళ్లాలంటే టైటిల్ కూడా చాలా ముఖ్యమే. సినిమా పేరు ఎంత డిఫరెంట్ గా ఉంటే అంత వేగంగా ఆడియెన్స్ మెదళ్లలో రిజిస్టర్ అవుతున్నాయి. అందులో భాగంగానే ఒక అక్షరంతో మొదలుకొని ఎన్నో రకాల టైటిల్స్ వచ్చాయి. ఇప్పుడు తెలుగు సినీ చరిత్రలోనే అతిపెద్ద టైటిల్‌తో సినిమా రాబోతోంది 'ఆ నలుగురు', 'మధుమాసం', 'అందరి బంధువయా', "ఇదీ సంగతి" 'ఆటగదరా శివా' తదితర చిత్రాలతో విలక్షణమైన దర్శకుడిగా తనకంటూ ఒక ప్రత్యేకతను సంపాదించుకున్నారు చంద్ర సిద్ధార్థ్. ఆయన తాజాగా రూపొందించిన చిత్రం 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు'. దీనికి ఉప శీర్షిక 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌బిడెన్ సాగా'. ఫిల్మోత్సవ్ బ్యానర్‌పై ఆయనే సొంతగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రముఖ దర్శక రచయిత మదన్ అందించిన కథతో ఈ సినిమా రూపొందింది. హర్ష హీరోగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'ఆ నలుగురు' చిత్రంతో మానవ సంబంధాలు, భావోద్వేగాలను బలంగా ఆవిష్కరించిన చంద్ర సిద్ధార్థ్, ఈసారి ఆధునిక థ్రిల్లర్ నేపథ్యంతో మరో భిన్నమైన చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నారు. ఇది మొట్ట మొదటి మిస్టరీ మ్యూజికల్ . సంగీతం, ధ్వని, మానవ మెదడు మధ్య ఉన్న సంబంధాన్ని కథలో కీలకంగా మలుస్తూ ఈ చిత్రం రూపొందింది. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను మిస్టరీ కథనంతో మేళవించిన చిత్రమిది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత చంద్ర సిద్ధార్థ్ మాట్లాడుతూ, "భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత పొడవైన టైటిల్ ఇది.నా స్నేహితుడైన మదన్ తో ఈ కథను సినిమా గా చేద్దామనుకున్నాము. ఇది మదన్ చనిపోయే ముందు చివరిగా ప్లాన్ చేసిన సినిమా. నేను అప్పట్లో మదన్ కథతోనే 'ఆ నలుగురు' సినిమా తీశాను.

# టీచర్స్ డే.. తండ్రి పేరిట ఫెలోషిప్‌ను ప్రకటించిన సచిన్



ఉపాధ్యాయ దినోత్సవంసందర్భంగా తన తండ్రి ప్రొఫెసర్ రమేశ్ తెందుల్కర్ జ్ఞాపకార్థం క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ కీలక ప్రకటన చేశారు. ప్రతి సంవత్సరం ఎండీ (డాక్టర్ ఆఫ్ మెడిసిన్) చేసే ఒక విద్యార్థికి ఆర్థికంగా సాయం అందించనున్నారు. యువ డాక్టర్లను ప్రోత్సహించేందుకు ముందడుగు వేశారు. ఇంగా హెల్త్ ఫౌండేషన్‌తో కలిసి తెందుల్కర్ ఫౌండేషన్ ఈ ఫెలోషిప్‌ను ఇవ్వనుంది. శ్రీనగర్‌లోని క్లెఫ్ట్, క్రానియోఫేసియల్ కేర్‌లో ప్రత్యేక శిక్షణ కోసం ఏటా ఎండీ చేసే ఒకరిని ఎంపిక చేయనుంది. "నాకు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. మా నాన్న నాలో అంతకంటే ఎక్కువ చూశారు. నేను ఏమవ్వాలో నిర్ణయించడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. స్వయంగా కనుక్కొనేందుకు అవసరమైన స్వేచ్ఛను నాకు ఇచ్చారు. నా తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థుల కోసం ఫెలోషిప్‌ను అందించనుండటం సంతోషంగా ఉంది. మా నాన్న నమ్మిన సిద్ధాంతం ఇది. విద్యే అవకాశాలను సృష్టిస్తాయని ఆయన భావించారు. అది ఇతరులకు ఉపయోగపడితే అంతకుమించిన పరమార్థం మరొకటి ఉండదు. ఉపాధ్యాయుని పాఠాలు ఒక విద్యార్థితో ప్రారంభం కావచ్చు. కానీ, వారి ప్రభావం ఎందరో జీవితాలకు, ఎన్నో తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని సచిన్ పోస్టు పెట్టారు.

# కేఎల్ లేకపోయినా దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు మేం సిద్ధం : తిలక్ వర్మ



దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచే ఈస్ట్ జోన్, సౌత్ జోన్ జట్ల మధ్య తుది పోరు జరగనుంది. తిలక్ వర్మ నాయకత్వంలోని సౌత్ జోన్ జట్టులో సిరాజ్, దేవదత్ పడిక్కల్ ఆడటం ఖాయమే. అయితే, కేఎల్ రాహుల్ రాకపై సందిగ్ధత ఉంది. రాహుల్ ఈ మ్యాచ్‌లో ఆడటం లేదని తిలక్ వెల్లడించాడు. ఫైనల్ నేపథ్యంలో ఇరు జట్ల కెప్టెన్లు తిలక్, ఇషాన్ కిషన్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

**షమీని సమర్థంగా అడ్డుకొంటాం: తిలక్**

"సీనియర్ పేసర్ షమీని అడ్డుకొనేందుకు సిద్ధంగానే ఉన్నాం. ఈ మ్యాచ్ రసవత్తరంగానే ఉండబోతోంది. గత మ్యాచ్‌లో షమీ ఎలా బౌలింగ్ చేశాడో మేం గమనించాం. బ్యాటర్లను ఇబ్బంది పెడుతూ లైన్ అండ్ లెంగ్త్‌తో కట్టడి చేసేందుకు ప్రయత్నిస్తాడు. అతడి బౌలింగ్‌ను ఎదుర్కొని సత్తా చాటుతాం" అని తిలక్ వర్మ తెలిపాడు.

**అది.. కేవలం నంబర్ మాత్రమే: ఇషాన్**

"మహ్మద్ షమీ అత్యుత్తమ ప్లేయర్. బెంగాల్ తరఫున ఆడేటప్పటి నుంచి అద్భుతమైన ప్రదర్శన చేస్తున్నాడు. వికెట్లు తీయడంతోపాటు మైదానంలో తన శక్తినంతా వినియోగిస్తాడు. భారత క్రికెట్‌కూ ఎన్నో సేవలు అందించాడు. ఇప్పుడందరూ వయసు గురించి మాట్లాడుతున్నారు. కానీ, అది కేవలం ఒక నంబర్ మాత్రమే. అతడి కష్టం గురించి ఎవరూ అనడం లేదు. ఇప్పటికీ షమీ భాయ్‌లో వికెట్ల దాహం తీరలేదు" అని ఇషాన్ తెలిపాడు. షమీతోపాటు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఎలా ఆడతాడనేది ఆసక్తికరంగా మారింది. సెమీస్‌లో అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు.

**దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు అగర్కార్**

చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ దులీప్ ట్రోఫీ ఫైనల్‌ను చూసేందుకు చెన్నై వెళ్లనున్నాడు. అతడి పదవీకాలంపై ఇటీవల పెద్ద చర్చే జరిగింది. అక్టోబర్ 4 వరకు ఉన్నప్పటికీ.. వచ్చే ఏడాది వరల్డ్ కప్ వరకూ పొడిగింపు ఉండే అవకాశం ఉంది. ఆ విషయంపై చెన్నైలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా - అగార్కర్ మధ్య సమావేశం జరగనుంది. ఇటీవల రివ్యూ మీటింగ్‌కు వ్యక్తిగత కారణాల వల్ల అగార్కర్ గైర్హాజరైన సంగతి తెలిసిందే. ఇక ఆసియా గేమ్స్ కోసం భారత్ మరో రెండు వారాల్లో జపాన్‌కు వెళ్లనుంది. జట్టుతోపాటు అదనంగా మరికొందరిని నెట్ బౌలర్లుగా పంపించాలని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మయాంక్ యాదవ్, కార్తిక్ త్యాగితోపాటు మోసిన్ ఖాన్ అవకాశం ఇవ్వనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఆసియా క్రీడలకు హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్న వీవీఎస్ లక్ష్మణ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

# పీసీబీ వద్దే రిమోట్ కంట్రోల్.. బాబర్ 'డమ్మీ కెప్టెన్'

మాజీ క్రికెటర్ విమర్శలు



పాకిస్థాన్ క్రికెట్ పతనావస్థకు చేరడానికి ప్రధాన కారణం బోర్డేనని మాజీ ఆటగాళ్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలోనే ఇంగ్లాండ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన తర్వాత ఆటగాళ్లతోపాటు కోచింగ్ సిబ్బందిపై పీసీబీ వేటు వేసింది. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌ను స్వదేశానికి పిలిపించింది. ఇక, సెలక్టర్ పదవికి మిస్బా ఉల్ హక్ రాజీనామా చేయడం సంచలనంగా మారింది. ఇప్పుడు పీసీబీ దృష్టంతా చీఫ్ సెలక్టర్ అకిబ్ జావెద్‌పైనే ఉంది. ఈ నేపథ్యంలోనే పాక్ బోర్డు తర్వాతి టార్గెట్.. కెప్టెన్ బాబర్ అజామ్ అంటూ మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ వ్యాఖ్యానించాడు. "మీరు (పీసీబీని ఉద్దేశిస్తూ) జట్టును 'రిమోట్ కంట్రోల్' ద్వారానే నడపాలని అనుకుంటున్నట్లు ఉంది. సర్ఫరాజ్, ఉమర్ గుల్‌ను ఎందుకు ఇంగ్లాండ్‌కు పంపారు? ఇప్పుడు ఆ ఇద్దరిని ఎందుకు వెనక్కి పిలిచారు? గ్యారీ కిర్‌స్టెన్, జాసన్ గిలెస్పీ నుంచి అధికారాలను ఎందుకు తొలగించారు? మీ నిర్ణయాలు ఏంటో అర్థం కావడం లేదు. మీ మాట కెప్టెన్ బాబర్ అజామ్ వినకపోతే అతడిని తొలగించి ఉండాల్సింది కదా..! అలా కాకుండా సర్ఫరాజ్, ఉమర్‌పై వేటు ఎందుకు? వీరి తర్వాత మీ లక్ష్యం ఎవరు? బాబర్ అజామేనా?" అని ఘాటుగా పోస్టు పెట్టాడు.

**బాబర్ రాజీనామా చేయాల్సింది..**

"పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేతిలో బలిపశువులైన ఆటగాళ్లు, కోచ్‌లకు సంఘీభావంగా కెప్టెన్ బాబర్ అజామ్ ఇప్పటికే రాజీనామా చేస్తే బాగుండేది. స్క్వాడ్‌లోని సగం జట్టును వెనక్కి పిలిపించడమంటే చిన్న విషయం కాదు. ఒకవేళ నేను ఆ ప్లేస్‌లో ఉండుంటే.. కెప్టెన్సీని వదిలేసేవాడిని. ఇప్పుడు నువ్వు (బాబర్) డమ్మీ సారథిగా మారిపోయావు. ఇమామ్‌ను స్వదేశానికి పంపించారంటే అతడికి గాయమైంది కాబట్టి అని అర్థం చేసుకుంటాం. మరో ఆరుగురిని ఎందుకు పంపారు? పాక్‌కు ఛాంపియన్స్ ట్రోఫీని అందించిన కోచ్‌తోపాటు స్టార్ పేసర్‌నూ వెనక్కి పిలిపించారు. ఇలాంటప్పుడు వారికి మద్దతుగా నిలవాల్సింది. కానీ సైలెంట్‌గా ఉన్నావు. పీసీబీకి నీలాంటి డమ్మీ కెప్టెన్ అవసరం ఎప్పుడూ ఉంటుంది" అని లతీఫ్ విమర్శించాడు.

# మేం చేయలేం కానీ..: ఆటగాళ్ల వసతి కోసం బీసీసీఐ రిక్వెస్ట్‌పై ఐవోఏ




జపాన్ వేదికగా జరగబోయే ఆసియా గేమ్స్‌లో వసతి సదుపాయాలు, క్రికెట్ మైదానంలోని పిచ్ నాణ్యతపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. మరీ ముఖ్యంగా క్రికెటర్లు ఉండేందుకు చాలా చిన్న గదులను సిద్ధం చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో తమ ప్లేయర్ల కోసం ప్రత్యేకంగా వసతి ఏర్పాటు చేయాలని బీసీసీఐ విజ్ఞప్తి చేసింది. కానీ, ఈ అభ్యర్థనను భారత ఒలింపిక్ సంఘం తిరస్కరించినట్లు తెలుస్తోంది. ప్రత్యేకంగా ఎవరికీ ఇలాంటి వసతి సదుపాయాలు కల్పించడం లేదని.. అది క్రికెటర్లకైనా తమ నిబంధనలు ఒకేలా ఉంటాయని ఐవోఏ స్పష్టత ఇచ్చినట్లు కథనాలు వస్తున్నాయి. అయితే సొంతంగా క్రికెటర్లకు వసతి కల్పించే అవకాశం మాత్రం బీసీసీఐకి ఉందని ఐవోఏ సీఈవో రఘురామ్ అయ్యర్ చెప్పినట్లు సమాచారం. "క్రీడాకారులకు వసతి ఏర్పాట్ల గురించి బీసీసీఐ సీఈవో హేమంగ్ అమిన్ నిరంతరం మాతో సంప్రదింపులు చేస్తూనే ఉన్నారు. ఆసియా గేమ్స్‌లో సదుపాయాలను అంచనా వేయడానికి జపాన్‌కు ఓ టీమ్‌ను పంపించాలని క్రికెట్ బోర్డు భావించింది. ఐవోఏ కూడా అందుకు సమ్మతించింది. ఆ కమిటీ ఇచ్చిన నివేదికను బట్టి ఆర్గనైజర్లు కల్పించిన సదుపాయాలను వారు వినియోగించుకుంటారా? లేకపోతే స్వతహాగా ఏర్పాట్లు చేసుకుంటారా? అనేది వారి ఇష్టం. సొంతంగా వసతి కల్పించుకుంటామంటే మాకేమీ అభ్యంతరం లేదు. మేం మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి సౌకర్యాలు కల్పించబోం" అని అయ్యర్ స్పష్టం చేసినట్లు సదరు కథనాలు వెల్లడించాయి. ఆసియా గేమ్స్ ఆర్గనైజర్లు.. భారత పురుషుల జట్టు ప్లేయర్లకు త్రీస్టార్ హోటల్, మహిళా క్రికెటర్ల కోసం ఫోర్ స్టార్ హోటల్‌ను కేటాయించారు. ఒక్కో గదిని ఇద్దరు ప్లేయర్లు షేర్ చేసుకోవాలి. మొదట మహిళా జట్టు జపాన్‌కు వెళ్లనుంది. సెప్టెంబర్ 17 నుంచి వారి మ్యాచులు ప్రారంభమవుతాయి. ఇక అక్కడి వేదికలు, హోటళ్లలో ఉండే సదుపాయాలను చెక్ చేసేందుకు వచ్చే వారంలో ఓ కమిటీ వెళ్లనుంది. ఆ తర్వాతే దీనిపై బీసీసీఐ తుది నిర్ణయం తీసుకుంటుంది.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com